నేటి దినపత్రిక
# సూర్య
బుధవారం
17 జనవరి
2024
పేజీలు 8
అమరావతి
గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్

# మినరల్ మాయ

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**
ఉమ్మడి గుంటూరు జిల్లాలో తాగునీటి సమస్య నీటి వ్యాపారానికి దారి తీసింది. మున్సిపాలిటీల్లో, గ్రామ పంచాయతీల్లో అంతంత మాత్రంగానేమంచినీరు సరఫరా అవుతోంది. అది కూడా శుభ్రంగా ఉండడం లేదు. ఆ నీరు తాగితే రోగాలబారినపడ్డట్లే. వైద్యానికి రూ. వేల ఖర్చు పెట్టుకోవడం కంటే మినరల్ వాటర్ తాగడం మంచిదనే నిర్ణయానికి ప్రజలు వచ్చేశారు. దీంతో మినరల్ వాటర్ బిజినెస్ మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్థిల్లుతోంది. అన్ని వ్యాపారాల్లో ఉన్నట్లే నీటి వ్యాపారంలో కూడా అనేక మాయలు జరుగుతున్నాయి. అసలు మినరల్ వాటర్ అవునా కాదా? అనే సందేహంతో సహా పలు అక్రమాలు జరుగుతున్నాయి. జిల్లాలో అనధికారికంగా రెండు వేలకు పైగా వాటర్ ప్లాంట్లు ఉన్నట్టు అంచనా. వీటిలో ఎన్ని ప్రమాణాలు పాటిస్తున్నాయో చెప్పడం కష్టం. ఇలాంటి నీరు తాగి జనం రోగాలబారిన పడుతున్నారు...

- అడ్డగోలుగా వాటర్ ప్లాంట్ల నిర్మాణం
- అనుమతులకు పాతర
- నీటి పరీక్షలు నిల్
- నిద్రావస్థలో అధికార గణం
- కోట్లలో తాగునీటి వ్యాపారం

2





తెలిసో తెలియకో
## పిచ్చి మొక్క నాటాం


మాజీ మంత్రి కామినేని
• 2లో..

# స్ఫూర్తిదాయకంగా
## సామాజిక న్యాయ మహాశిల్పం

**బీ.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే ప్రామాణికంగా పాలన**
**రాజకీయాలు, పార్టీలకతీతంగా అందరూ తరలిరావాలి...**
**19వ తేదీ సాయంత్రం 4 గం.లకు సీఎం చేతుల మీదుగా ఆవిష్కరణ**
**20వ తేదీ నుంచి అందరికీ ప్రవేశం**

**విజయవాడ బ్యూరో మేజర్ న్యూస్ :** దేశంలోని దళిత, బలహీన, బడుగు వర్గాలకు ఆరాధ్య దైవంగా విలసిల్లుతున్న డాక్టర్ భీంరావు రాంజీ అంబేద్కర్ అనే దార్శనికుడు భారతదేశంలో పుట్టి ఉండకపోతే స్వాతంత్రం వచ్చిన 75 ఏళ్ల తర్వాత కూడా దేశంలో కుల, వర్ణ వివక్ష ఇప్పటికీ కొనసాగుతూ ఉండేదని రాజ్యసభ సభ్యులు వి. విజయసాయిరెడ్డి అన్నారు. స్వరాజ్య మైదానంలో సామాజిక న్యాయ మహా శిల్పం పేరుతో నిర్మిస్తున్న బిఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణం పనులను ఆయన మంగళవారం వారం పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. విగ్రహ నిర్మాణ పనులు మరింత వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. విగ్రహ నిర్మాణ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన థియేటర్లో అంబేద్కర్ జీవిత గాథను సమగ్రంగా వివరించేలా రూపొందించిన లఘు చిత్రాన్ని ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ నాలుగు గంటలకు ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభ అనంతరం స్వరాజ్య మైదానంలో ముఖ్యమంత్రి వైఎస్ 2







# సీజేఐ ముందుకు
## చంద్రబాబు క్వాష్ పిటిషన్

**తీర్పు వెల్లడించిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం**
**భిన్నాభిప్రాయాలు వ్యక్తం**



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెదేపా అధినేత చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. జస్టిస్ అనిరుద్ధబోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన ధర్మాసనం మిగతా 2లో

(మొదటిపేజీ తరువాయి)

## తెలిసో తెలియకో పిచ్చి మొక్క నాటాం

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** రాష్ట్రం, తమ పిల్లల భవిష్యత్తు కోసం ప్రజలు ఆలోచించి మంచి నిర్ణయం తీసుకోవాలని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. తెలిసో, తెలియకో రాష్ట్రంలో ఒక పిచ్చి మొక్క నాటామని వ్యాఖ్యానించారు. తెనాలిలో దివంగత నేత, మాజీ మంత్రి యడ్లపాటి వెంకట్రావు నివాసంలో జనసేన పీఏసీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో కలిసి ఆయన అల్పాహారం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. తమది రాజకీయ భేటీ కాదని, ఆత్మీయ సమావేశం మాత్రమేనన్నారు. ఎవరు ఎక్కడ పోటీ చేయాలనే విషయం భాజపా, జనసేన, తెదేపా ముఖ్య నేతలు చూసుకుంటారని చెప్పారు. రాష్ట్రంలో అనేక అరాచకాలు జరుగుతున్నాయని విమర్శించారు. కరెంటు, పెట్రోలు, నిత్యావసరాల ధరలు పెంచిన ప్రభుత్వం.. రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనలో విఫలమైందని ఆరోపించారు. ప్రజలు తమవంతు పాత్ర పోషించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

# సీజేఐ ముందుకు

## చంద్రబాబు క్వాష్ పిటిషన్

మంగళవారం తీర్పు ఇచ్చింది. ద్విసభ్య ధర్మాసనంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17-ఎ అన్వయించడంలో తమకు వేర్వేరు అభిప్రాయాలు ఉన్నాయని న్యాయమూర్తులు చెప్పారు. దీంతో తదుపరి చర్యల కోసం సీజేఐకు నివేదిస్తున్నామని తెలిపారు.

చంద్రబాబుపై కేసుల్లో తగిన అనుమతులు లేకుండా ముందుకెళ్లారని జస్టిస్ అనిరుద్ధబోస్ అన్నారు. కేసుల నమోదుకు ముందు సీఐడీ తగిన అనుమతి తీసుకుని ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. సెక్షన్ 17-ఎ కింద ముందస్తు అనుమతులు తప్పనిసరని.. లేకపోతే అది చట్ట విరుద్ధమని తన తీర్పులో వెల్లడించారు. 2018 చట్ట సవరణ కంటే ముందు జరిగిన నేరాలకు ఆ సెక్షన్ వర్తించదని జస్టిస్ బేలా ఎం. త్రివేది అన్నారు. నిజాయతీ గల పబ్లిక్ సర్వెంట్స్‌కు ఇబ్బంది ఉండకూడదనే సెక్షన్ 17-ఎ చట్టసవరణ తెచ్చారని చెప్పారు. ఇద్దరు న్యాయమూర్తుల మధ్య భిన్నాభిప్రాయాల నేపథ్యంలో సీజేఐకి నివేదిస్తున్నట్లు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అనిరుద్ధ బోస్ ప్రకటించారు. గవర్నర్ అనుమతి తీసుకోకుండా ఏపీ సీఐడీ తనపై నమోదు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ కేసును కొట్టేయాలంటూ సుప్రీంలో చంద్రబాబు స్పెషల్ లీవ్ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఆయన తరఫున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, హరీశ్ సాల్వే.. సీఐడీ తరఫున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఈ కేసును జస్టిస్ అనిరుద్ధబోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిలతో కూడిన ధర్మాసనం విచారించి అక్టోబరు 17న తీర్పు వాయిదా వేసింది.

## ఎస్ఐగా ఎంపికైన అనూషకు ఘనసన్మానం




**చల్లపల్లి మేజర్ న్యూస్ :** ఇటీవల విడుదలైన ఎస్ఐ ఫలితాల్లో ఎస్ఐగా ఎంపికైన చల్లపల్లి మండలం సాలిపేటకు చెందిన మాచవరపు అనూషను మాచవరపు కుటుంబీకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. సాలిపేటలోని ఇమ్మానియేల్(ఐజీఎంఐ) చర్చిలో అనూషను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మాచవరపు ఆదినారాయణ పాల్గొని ప్రసంగిస్తూ అనూషను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు శామ్యేలు..కుమారి, మాచవరపు కుటుంబీకులు మనోజ్కుమార్, ఏసోబు, సుబ్బయ్య, శ్రీనివాసరావు, రాజేష్, కార్తీక్, నాగేశ్వరరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## బాలసౌరి చేరికతో బలోపేతం



**చల్లపల్లి - మేజర్ న్యూస్ :** మచిలీపట్నం ఎంపీ, వైసీపీ ముఖ్య నాయకులు వల్లభనేని బాలసౌరి చేరికతో జనసేన పార్టీ మరింతగా బలోపేతం అవుతుందని జనసేన చల్లపల్లి పట్టణ అధ్యక్షుడు బొందలపాటి వీరబాబు అన్నారు. మంగళవారం చల్లపల్లి, మోపిదేవి జనసేన నాయకులు బాలసౌరిని కలిసి సత్కరించారు. చల్లపల్లి మండల ప్రధాన కార్యదర్శి మిరియాల జితేంద్ర, అవనిగడ్డ నియోజకవర్గ ఐటీ కోఆర్డినేటర్ సూదాని నందగోపాల్, చేబ్రోలు రాము, సాయికృష్ణ, మోపిదేవి మండల కార్యదర్శి కలపాల ప్రసాద్ తదితరులు బాలసౌరిని కలిసిన వారిలో ఉన్నారు.

# మినరల్ మాయ

### అడ్డగోలుగా వాటర్ ప్లాంట్ల నిర్మాణం

### అనుమతులకు పాతర - నీటి పరీక్షలు నిల్

### నిద్రావస్థలో అధికార గణం - కోట్లలో తాగునీటి వ్యాపారం



**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో :** వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి కనీసం 1600 అడుగుల స్థలం ఉండాలి. ఆ స్థలంలో ఏర్పాటు చేసిన ప్లాంట్‌లో ఫిల్లింగ్ రూం, క్యాన్ల స్టోరేజ్ గది, మైక్రోబయాలజీ, కెమికల్ ల్యాబ్, ప్లాంట్ రూం తప్పనిసరిగా ఉండాలి. ఈ ప్రమాణాలతో ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే ఖర్చు బాగానే అవుతుంది. చాలా ప్రాంతాల్లో ఒక్క గదిలో వాటర్ ప్లాంట్‌ను నిర్వహిస్తున్నారు. అలాంటి ప్లాంట్లకు అనుమతి లేనట్లే. వాటర్ ప్లాంట్ నిర్వహణకు టెక్నీషియన్ అవసరం. ఎప్పటికప్పుడు నీటిని పరిశీలించి నెలకొకసారి వాటర్ ప్లాంట్ నీటిని వేరే ల్యాబరేటరీకి పంపించి పరీక్షలు నిర్వహించాలి. కెమికల్ టోటల్ వాటర్ డిసాల్వ్‌డ్ లెవెల్ ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలి. లేకపోతే ఆ నీరు తాగిన వాళ్లకు మోకాళ్ల నొప్పులు వస్తాయి. కొన్ని వాటర్ ప్లాంట్‌ల్లో మాత్రమే ఇలాంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. వాటన్నిటి రికార్డులు భద్రపరచాలి. అధికారులు తనిఖీలునిర్వహించక పోవడంతో ఇష్టారాజ్యంగావాటర్ ప్లాంట్లు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

**లక్షలాది లీటర్లు తోడేస్తున్నారు..** బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నిబంధనల ప్రకారం నాలుగువేల లీటర్ల సామర్థ్యం గల ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే రూ.20 లక్షలు వరకూ ఖర్చవుతుంది.నిర్వహించడానికి ఏడాదికి రూ.2 లక్షల వరకూ వ్యయం అవు తుంది. నీటి నమూనాలను పరీక్షించి రికార్డు చేసి ప్రతి మూడు నెలలకొకసారి బీఐఎస్‌కు పంపాలి. జిల్లాలో రోజుకు ఒక్కో ప్లాంట్ నుంచి సగటున 50 వేల లీటర్ల నీటినిసరఫరాచేస్తున్నారు. మూడు కోట్ల లీటర్ల నీటిని ప్రతి నిత్యం తోడేస్తున్నారు. దీనివల్ల భూగర్భ జలాలు తీవ్రంగా పడిపోయే ప్రమాదం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు.

**బీఎస్ఐ అనుమతులు ఎక్కడా?** శుద్ధ ప్లాంట్లు ఏర్పాటు చేయడానికి బీఎస్ఐ (బ్యూరో ఆఫ్ స్టాండర్డ్ ఇండియా) ఆమోదం పొందాల్సి ఉంది. ఈ సంస్థ అధికారులు ప్లాంట్లలో నీటి స్వచ్ఛత, యంత్రాలను స్వయంగా పరిశీలిస్తారు. దీనికి ప్రత్యేకంగా ల్యాబ్, ఏసీ, నీళ్లు నింపేందుకు ప్రదేశం ఉండాలి. కానీ ఇళ్లలో బోర్లు వేసి నిబంధనలకు విరుద్ధంగా నీటి వ్యాపారం కొనసాగిస్తున్నారు. నీటిలో ఫ్లోరైడ్ ఇతర పదార్థాలు నశించడానికిరసాయనాలు తగిన మోతాదులో వాడటం లేదు. కొందరు బోరు నీటినేయథాతథంగా విక్రయిస్తున్నారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు పలు ప్రభుత్వ శాఖలతో లింకు ఉంటుంది. ప్రాథమికంగా చిన్నతరహాపరిశ్రమలశాఖ నుంచిఅనుమతిపొందాలి. ఆ తర్వాత ట్రాన్స్‌కో నుంచి కరెంటు సరఫరాకు ఆపై పర్యావరణశాఖ, మున్సిపాలిటీ,పంచాయతీ గ్రీన్‌సిగ్నల్ రావాలి. సంబంధిత ప్లాంట్ నుంచి సరఫరా చేస్తున్న వాటర్ క్యాన్లు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించాల్సిన బాధ్యత తూనికలు, కొలతల శాఖది. ఆయా క్యాన్లలో ఉన్న నీరు సురక్షితమైనదా కాదా అనేది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు పరిశీలించాలి. రికా ర్డులను పరిశీలించడం రెవెన్యూ శాఖ పని. అంటే ఒక ప్లాంట్ నిర్వహణకు ఇన్ని శాఖల పర్యవేక్షణ ఉండాలి. కానీ ఇన్ని శాఖలు క్రమం తప్పకుండా పర్య వేక్షణ చేస్తున్నాయా అంటే లేదనే చెప్పాలి. గ్రామాల్లో ఫ్లోరోసిస్ పెరిగిపోవడం ఒక కారణమైతే ప్రజలకు నీటినిసరఫరాచేయడంలో ప్రభుత్వం విఫలం కావ డం మరో కారణం. దీంతో పుట్టగొడుగుల్లా వాటర్ ప్లాంట్ పుట్టుకొచ్చేశాయి.

### నీటి ప్లాంట్లలో ఉండాల్సిన ప్రమాణాలు ఇలా..

- బీఎస్ఐ (బ్యూరో ఆఫ్ స్టాండర్డ్ ఇండియా) మార్కు.
- వాటర్ టెస్టింగ్ స్టాండర్స్ బ్యూరో నుంచి త్రైమాసిక నాణ్యత పత్రం
- క్వాలిఫైడ్ టెక్నీషియన్
- ప్రతి రోజూ క్యాన్‌లు శుభ్రపరచాలి
- నగర పాలక సంస్థ, గ్రామ పంచాయతీల నుంచి ఎన్ఓవసీ, డీఎన్‌వో లైసెన్స్ తీసుకోవాలి.
- పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతి ఉండాలి.
- ప్రతి రోజూ మైక్రో బయాలజీ, బయో కెమికల్ టెస్టులు నిర్వహించాలి.
- సిబ్బందికి ప్రతి 6 నెలలకోసారి వైద్య పరీక్షలు నిర్వహించాలి.
- తయారు చేసిన బాటిళ్లు, ప్యాకెట్లపైమ్యానిఫాక్చరింగ్ తేదీ ఉండాలి.

**నెలకు రూ. కోట్ల నీటి వ్యాపారం..** జిల్లాలోని నగరపాలక సంస్థతోపాటు మున్సిపాలిటీలు, మండల కేంద్రాల గ్రామీణ ప్రాం తాల్లో కలిపి అప్రూవల్ లేని మినరల్ ప్లాంట్లు సు మారు మూడువేలకు పైగానే ఉన్నాయి. 20 లీటర్ల క్యాన్‌లు, రెండు లీటర్ల బాటిళ్లు, 200 మిల్లీలీటర్ల ప్యాకెట్ల రూపంలో రోజూ సుమారు 30 లక్షల లీటర్ల నీటివ్యాపారంజరుగుతోంది. రోజుకు రూ. 30లక్షలు, నెలకు రూ. కోట్లలో జిల్లా ప్రజలు కేవలం నీళ్ల కోసం ఖర్చుచేస్తున్నారని పరిశీలకులు అంటున్నారు.

**అధికారుల నిఘా కొరవడింది..** అనుమతిలేనివాటర్‌ప్లాంట్లను అరికట్టడంలో అధికారుల నిఘా కొరవడింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు మినరల్ వాటర్ తాగడం వల్ల అనేక జబ్బులు కొనితెచ్చుకుంటున్నారు. డబ్బే ప్రధాన లక్ష్యంగా యజమానులు ప్రమాణాలను గాలికి వదిలేసి వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలు అవగాహన పెంచుకుని మున్సిపల్ నీటిని వేడి చేసుకుని తాగాలి.

**సీజ్ చేసే అధికారం ఇవ్వాలి...** నగర పాలక సంస్థ పరిధిలో అనధికారికంగా మినరల్ వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. అయితే వాటిని సీజ్ చేసే అధికారం నగర పాలకులకు లేదు. శుద్ధి చేయని నీటిని తాగడం వల్ల. కళ్లజబ్బు, లివర్, మోషన్స్,మోకాళ్లనొప్పులు వచ్చే అవకాశాలు ఉంది. నగరంలో అతి తక్కువ మినలర్ వాటర్ ప్లాంట్లకు మాత్రమే ట్రేడ్ లైసెన్సు ఉన్నాయి.

# స్ఫూర్తిదాయకంగా సామాజిక న్యాయ మహాశిల్పం

(మొదటిపేజీ తరువాయి)



జగన్మోహన్ రెడ్డి విగ్రహావిష్కరణ చేస్తారని చెప్పారు. గత కొన్ని శతాబ్దాలుగా దళితుల పట్ల సమాజం చూపుతున్న వివక్ష, అస్పృశ్యత వంటి అంశాలను పటాపంచలు చేస్తూ రాష్ట్రంలో 81 అడుగుల వేదికపై 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టతో దళితులు సమాజంలో ఆత్మగౌరవంతో బతికే ఒక సమ సమాజ భావజాలాన్ని పెంపొందించడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ విగ్రహ ప్రతిష్టాపనకు సంకల్పించిందని తెలిపారు. ఈ విగ్రహ ప్రతిష్ట ప్రాంగణంలో ఆడిటోరియం, అంబేద్కర్ జీవిత కాలంలో వినియోగించిన వస్తువులతో మ్యూజియం, లేజర్ షో వంటి అత్యాధునిక సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భవిష్యత్తులో ఈ సామాజిక న్యాయ మహా శిల్ప ప్రాంగణం ఒక గొప్ప పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. దేశంలో, రాష్ట్రంలో వ్యవస్థలు సక్రమంగా తమ తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయంటే అందుకు కారణం ఆనాటి రాజ్యాంగమే కారణమన్నారు. అంబేద్కర్ ఆలోచనా విధానమే తమ ప్రభుత్వానికి మార్గదర్శకమన్నారు. దేశంలో అన్ని వర్గాల ప్రజలు ఆత్మగౌరవంతో జీవించేందుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు అంబేద్కర్ వంటి ఒక మహా పురుషుని జీవిత గాథ తెలుసుకునేందుకు ఈ సామాజిక న్యాయ మహా శిల్పం ఒక దిక్సూచిగా నిలుస్తుందన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులందరూ గర్వంగా తలెత్తుకొని ఆత్మగౌరవంతో జీవించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తలపెట్టిన ఈ మహోన్నత కార్యక్రమంలో కుల మతాల కతీతంగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశంలోనే ఇంత పెద్ద అంబేద్కర్ విగ్రహం మరే రాష్ట్రంలో లేదని వివరించారు. ఇటువంటి అద్భుతమైన విగ్రహాన్ని ఏర్పాటు చేయటం రాష్ట్ర ప్రభుత్వానికి దళితుల పట్ల ఉన్న గౌరవాన్ని చాటుతుందన్నారు. సమాజంలో అన్ని సామాజిక వర్గాలతో సమానంగా దళితులు కూడా సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో అభివృద్ధి చెందేందుకు డాక్టర్ అంబేద్కర్ ఆనాడు రచించిన రాజ్యాంగం వల్లనే దళితులు నేడు మిగతా వర్గాలకు సమాంతరంగా అభివృద్ధి చెందుతున్నారని తెలిపారు. అటువంటి మహనీయుడు అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రామాణికంగా తీసుకొని దళితుల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. ఈ విగ్రహ ప్రతిష్టాపనతో అంబేద్కర్ అనే పేరు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఘట్టంగా ఆయన అభివర్ణించారు. ఈ మహోన్నత కార్యక్రమంలో దేశంలో వివిధ రాష్ట్రాలకు చెందిన దళిత మేధావులు పాల్గొంటారన్నారు. రాష్ట్రంలోని దళితులందరూ గౌరవంతో జీవించేందుకు ఈ విగ్రహ ప్రతిష్టాపన ఒక చారిత్రక అవసరమన్నారు. రాజకీయాలకతీతంగా ఈ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో మేధావులు, ప్రజా సంఘాలు, సమాజ హితైషులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కార్యదర్శి వై. శ్రీలక్ష్మి, ముఖ్యమంత్రి కార్యక్రమాల పర్యవేక్షకులు తలశిల రఘురాం, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ టి. విజయ్ కుమార్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీ రావు, పార్లమెంటు సభ్యులు కేశినేని శ్రీనివాస్, విజయవాడ మధ్య, పశ్చిమ నియోజకవర్గాల శాసనసభ్యులు మల్లాది విష్ణువర్ధన్, వెలంపల్లి శ్రీనివాస్ లతో సహా వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జోసెఫ్ తంబీ నడయాడిన పుణ్యస్థలం మానికొండ



**గన్నవరం (ఉంగుటూరు), జనవరి 17, మేజర్ న్యూస్ :** ఉంగుటూరు మండలం, మానికొండ గ్రామములో బ్రదర్ జోసఫ్ తంబి79 వ వర్ధంతివేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పూజ్య గురువులు రెవరెండ్ ఫాదర్ చింతగుంటసురేష్ బాబు సమిష్టి దివ్యబలిపూజ అర్పిచారు. ఫాదర్ మార్టిన్ ఫాదర్ రసారియో పాల్గొన్నారు. అనంతరము పూజ్య గురువులు ఫాదర్ చింతగుంట సురేష్ బాబు మాట్లాడుతూ బ్రదర్ జోసెఫ్ తంబీ నడయాడిన పుణ్య స్థలం మానికొండ ఈ గ్రామానికి బ్రదర్ జోసఫ్ తంబిగారికి ఫాదర్ చింతగుంట సురేష్ బాబు వారి కుటుంబానికి మధ్య ఉన్నటువంటి అనుబంధం జరిగిన అద్భుతాలు గురించి చక్కగా వివరించారు. పెద్ద అవుటపల్లి స్థిరపడి చుట్టుపక్కల ఎన్నో ప్రాంతాల్లో ముఖ్యముగా మానికొండ గ్రామములో క్రీస్తుబోధనలు చేస్తూ క్రీస్తు సేవలో తరించారని పేదల ప్రజలకుఎన్నో సేవ కార్యక్రమాలు వైద్యం, విద్య అందించిన మహోన్నత వ్యక్తి క్రీస్తు మార్గాన్ని అనుసరించి ఆయన ధన్యుడయ్యా డనిపూజ్య గురువులు అన్నారు.

దివ్యబలిపూజ అనంతరం ఉప్పులూరు విచారణ కర్తలు రెవరెండ్ ఫాదర్. లింగతోటి రత్నకిషోర్ మాట్లాడుతూ గత 79 సంవత్సరాలుగా బ్రదర్ జోసెఫ్ తంబీ వర్ధంతి వేడుకలు నిర్వహిస్తున్న మానికొండ ఆర్ సీయంసంఘ భక్తిని కొనియాడారు పూజను అర్పించిన గురువులకు ఘన సన్మానం జరిగింది అనంతరం మధ్యాహ్నము 12 గంటలకు జోసెఫ్ తంబీ దేవాలయ ప్రాంగణములో అన్నసంతర్పణ నాలుగు వేల మందిభక్తులు పాల్గొన్నారు. మధ్యాహనము 3 గంటలకు పళ్ళుఫలముల వేలంపాట అనంతరము సాయంత్రం 6 గంటలకు తేరు ప్రదక్షిణః తంబిగారిచిత్రపటం మానికొండ పురవీధులలో ఘనముగా నిర్వహించడం రాత్రి 9 గంటలకు బ్రదర్ జోసఫ్ తంబి నాట్యమండలి వారిచే. మగ్ధ లేనా మరియా అనే బైబిల్ నాటకం, మానికొండ గాయక బృందం మేరుగు రాజేష్. మద్దులూరి ఆశాలత ఆధ్వర్యములో ఆధ్యాత్మిక గీతాలు బ్రదర్ జోసఫ్ తంబి79 వ వర్ధంతి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమములో ఉపదేశి ఇట్ట జోసెఫ్ మానికొండ గ్రామప్రజలు మరియ దళ సభ్యులు సంఘ పెద్దలు. తంబి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## నాగేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించిన సినీ దర్శకుడు మారుతి

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మచిలీపట్నం ఖోజ్జిలపేటలో వేంచేసియున్న శ్రీ నాగేశ్వర స్వామి దేవాలయాన్ని మంగళవారం సినీ దర్శకుడు మారుతి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతించగా ఆలయంలోకి ప్రవేశించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత సంవత్సరం ఈ దేవాలయానికి ప్రహరీ గోడ నిర్మాణం కోసం మారుతి ఆర్థిక సహాయం, అందించినప్పుడు దాన్ని దగ్గర ఉండి కమిటీ నిర్వాహకులు ధర్మరాజు సేవ చేసి నిర్మించడం ఆయనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఈ సందర్భంగా మారుతి ధర్మరాజు కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎంతో మహత్తు కలిగిన ఈ దేవాలయానికి పోయిన సంవత్సరానికి ఈ సంవత్సరానికి పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగి ఎంతో కన్నుల పండుగగా ఉందని ఇకముందు కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకుంటానని ఈ సందర్భంగా మారుతి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ బందర్ లో పుట్టి పెరిగిన ఈ దర్శకుడు ఆలయానికి చేసిన అభివృద్ధికి కృతజ్ఞతలు తెలియజేస్తూ త్వరలో ప్రభాస్తో నిర్మించే సినిమా విజయవంతం కావాలని దానికి ప్రతి ఒక్కరు సహాయ పడాలని దేవుని ఆశీస్సులు కలగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీరామ భక్త నరసింహం మారుతి దంపతులు, వై శిరీష కార్య నిర్వహణ అధికారి రాగం ధర్మరాజు, అధ్యక్షులు జోగి నాగార్జున, తెల్లం విశ్వనాథ్, దావిరెడ్డి నాగవేణి, చిత్త జల్లు ప్రసన్న 24వ డివిజన్ కార్పొరేటర్ మాదిరెడ్డి అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సమతా సంకల్పం పేరుతో కార్యక్రమాలు చేపట్టాలి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** సామాజిక సమత సంకల్పం కార్యక్రమంలో భాగంగా ఈనెల 17వ తేదీన బుధవారం జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్ర హాలను సుందరంగా అలంకరించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశిం చారు. ఈనెల 19న విజయవాడ స్వరాజ్ మైదానంలో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించు సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందస్తుగా సామాజిక సమతా సంకల్పం పేరుతో పలు కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందులో భాగం గా ఈనెల 17న జరిగే ఈ కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు సిబ్బంది సమన్వయంతో నిర్వహించాలని ప్రజలు ముఖ్యంగా ఎస్.సీ. ఎస్టీ, బీసీ మైనారిటీ సంక్షేమ సంఘాల నాయకులు, ప్రతినిధులను ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అలాగే జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు తదితర మండల స్థాయి అధికారులు, గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది అందరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

## రా కదలి రా గుడివాడ బహిరంగ సభను విజయవంతం చెయ్యండి



**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** జనవరి 18న గుడివాడలో జాతీయ టీడీపీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా జరగబోయే రా కదలి రా భారీ బహిరంగ సభ ను విజయవంతం చెయ్యాలని మాజీ పార్లమెంట్ సభ్యులు, కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు పిలుపునిచ్చారు. కావున రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం లో దగా పడిన ప్రతి ఒక్కరు ఈ కార్యకమంలో పాల్గొని చంద్రబాబు నాయుడు కి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, పొలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర, గుడివాడ నియోజకవర్గ ఇన్చార్జి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# మచిలీపట్నం ఓడరేవుకు పెద్ద సంఖ్యలో హాజరవుతున్న సందర్శకులు







**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** అన్నం ఉడికిందా లేదా అని తెలుసుకోవడానికి ఒక్క మెతుకు పట్టుకొంటే చాలు అర్థమయిపోతుంది అలాగే ఎంతో ప్రతిష్టాత్మకమైన మచిలీపట్నం పోర్టు నిర్మాణం ఏ స్థాయిలో జరుగుతుందో స్వయంగా పారదర్శకంగా తెలుసుకోమని అవకాశం ఇవ్వడంతో మచిలీపట్నం పోర్టు ప్రాంతం ఎంతో సందడిగా మారింది. గత ఎనిమిది నెలలుగా శరవేగంగా నిర్మితవుతున్న మచిలీపట్నం పోర్టు పనులను కళ్లారా వీక్షించేందుకు జిల్లావ్యాప్తంగా సందర్శకులు పోటెత్తుతున్నారు. అభివృద్ధికి ఆనవాలుగా మచిలీపట్నం ఓడరేవు చక చక నిర్మాణ పనులు రేయింబగళ్ళు పూర్తి చేసుకుంటున్న తరుణం గమనిస్తే ఇదే కదా మన కృష్ణాజిల్లాకు నిజమైన సంక్రాంతి అని పలువురు పేర్కొంటున్నారు. జిల్లావాసుల దశాబ్దాల స్వప్నంను సాకారం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి చిత్తశుద్ధి, ప్రజల అభీష్టానికి అనుగుణంగా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఎంతో పకడ్బందీగా చేస్తున్న మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని కి, పేర్ని కృష్ణమూర్తికి (కిట్టు) హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేస్తున్నారు. తెలుగు ప్రజల పెద్ద పండుగ రోజున సంక్రాంతి సెలవల్లో సందర్శకుల కోసం అనుమతిచ్చిన నిర్వాహకులకు ధన్యవాదాలు ప్రజలు తెలియచేస్తున్నారు.



## టీడీపీలోకి గాదిరెడ్డి బ్రదర్స్

**గుడివాడ, మేజర్ న్యూస్:** గుడివాడ రూరల్ మండలం లింగవరం గ్రామానికి చెందిన వైకాపా నేతలు గాదిరెడ్డి చిరంజీవి రెడ్డి, గాదిరెడ్డి చినబాబు, తమ అనుచరులతో కలిసి తెలుగుదేశం తీర్థం పుచ్చుకున్నారు. గుడివాడ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ వెనిగండ్ల రాముపార్టీ జండా కప్పి వీరిని పార్టీలోకి ఆహ్వానించారు. 2024 ఎన్నికలలో గుడివాడలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వెనిగండ్ల రాము విజయమే లక్ష్యంగా పనిచేస్తామన్న చిరంజీవిరెడ్డి, గాదిరెడ్డి చినబాబు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మలిరెడ్డి ప్రభాకర రెడ్డి, కాటూరి యేసుపాదం, గోపాల స్వామి, మార్క్ రాజు, రవిబాబు, రంగబాబు, నాగరాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## ఓల్డ్ బ్రిడ్జ్ మ్యూచువల్ ఫండ్ తొలి ఎన్ఎఫ్ఓ



**విజయవాడ, మేజర్ న్యూస్:** ఓల్డ్ బ్రిడ్జ్ క్యాపిటల్ మేనేజ్ మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ స్పా న్సర్ చేసిన ఓల్డ్ బ్రిడ్జ్ మ్యూ చువల్ ఫండ్, దాని తొలి ఈక్విటీ నూతన ఫండ్ ఆఫర్ 'ఓల్డ్ బ్రిడ్జ్ ఫోకస్డ్ ఈక్విటీ ఫండ్, పరిచయంతో డైనమిక్ ఇండియన్ మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలో అడుగుపెట్టింది. ఈ ఓపెన్-ఎండెడ్ ఈక్విటీ పథకం పెట్టుబడి దారులకు జాగ్రత్తగా ఎంపిక చేసిన కంపెనీల వృద్ధి సామర్థ్యంలో పాల్గొనడానికి ఒక ప్రత్యేక అవకాశాన్ని అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఎన్ఎఫ్ఓఈ నెల 17 నుండి 19 వరకు సబ్స్క్రిప్షన్ కోసం తెరిచి ఉంటుంది. పెట్టుబడి దారులు కనీస పెట్టుబడి రూ.2,500 తర్వాత, రూ.1గుణకాలతో పాల్గొనవచ్చు.

## మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తించారు: ఫతావుల్లా



**నందిగామ, జనవరి 16, మేజర్ న్యూస్:** దుబాయి కరిముల్లా అనే వ్యక్తి పార్టీలకు అతీతంగా ఇస్లాం మతం పాటించే సోదర సోదరీమణుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తించాడు అని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఫతవుల్లా అన్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇస్లాం చెప్తుంది ఒక స్త్రీ తల్లి ఒక స్త్రీ చెల్లి అని మత ప్రవక్తే స్వయంగా బోధించారు. ఆ బోధనలను కూడా మరచిన ప్రబుద్ధుడు షేక్ కరీముల్లా అలియాస్ (దుబాయ్ కరిముల్లా) ని ఏమనాలో ఆయన ఆలోచనకే వదిలేద్దాం.ఒక దళిత మహిళను కించ పరుస్తూ మంత్రులు,ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ల సమక్షంలో ఒక వ్యంగ్య చిత్రాన్ని ప్రదర్శించి నవ్వుకోవడం వీళ్ళ మానసిక పరిస్తితి తెలియచేస్తుంది.ఇది ఒక్క దళిత మహిళ సౌమ్యకి జరిగిన అవమానం కాదు యావత్ మహిళా సమాజానికి జరిగిన అవమానం. అతని మీద అధికారులు చర్యలు తీసుకోక పోతే జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని యావత్ మైనారిటీ సభ్యులు అందరూ సౌమ్య గకి అండగా ఉంటామని తెలియజేశారు.

## కొనసాగుతున్న అంగన్వాడీల నిరసన



**నందిగామ, జనవరి 16, మేజర్ న్యూస్:** అంగన్వాడీ వర్కర్స్ నిరసనలో అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సి హెచ్ సుప్రజ అధ్యక్షురాలు గజలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడిని ఆరు సార్లు చర్చలుగా పిలిచి అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన పేరుతో అంగన్వాడీలను సమ్మె విచ్చిన్నం చేయడానికి. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమ్మె మీద ఎస్మా చట్టం ప్రయోగించింది ఎన్ని ఎస్మా చట్టాలు తీసుకొచ్చిన అంగన్వాడీల సమస్యలు పరిష్కారం అయ్యేదాకా రాష్ట్రవ్యాప్తంగా సమ్మె ఉధృతం చేస్తామని తెలియజేశారు.మేము రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టమొదటి నుంచి మాకు కనీస వేతనాలు పెంచాలి.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె. గోపాల్. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ జిల్లా కార్యదర్శి చనుమోల సైదులు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు లాలా హమ్మద్ గౌస్, కర్రి వెంకటేశ్వరరావు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ అండ్ హెల్పర్ సీనియర్ ప్రాజెక్టు కార్యదర్శి కోల్లి సరళ,వెంకట్రావమ్మ, మహాలక్ష్మి,వేణు, సుజాత, పిచ్చిమ్మ,రాణి, వాసవి తదితరులు పాల్గొన్నారు.

## జింజేరులో ఘనంగా సంక్రాంతి సంబరాలు



**పెడన, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని జింజేరు గ్రామంలో గల గౌడపాలెంలో సంక్రాంతి పండుగ సందర్భంగా మన ఊరు – మన అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు, ఆటలు, పాటలు, డాన్స్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంకు ముఖ్య అతిగా పెడన ఎస్ఐ రవి చంద్ర కుమార్ విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎస్సై రవిచంద్ర కుమార్ మాట్లాడుతూ పండగలకు అసంఘిత కార్యక్రమాలకు పాల్పడకుండా ఇలాంటి పోటీల వల్ల మంచి పండుగ వాతావరణం గ్రామాలలో ఉంటుందన్నారు, పోటీలను నిర్వహించిన మన ఊరు –మన అభివృద్ధి కమిటీ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమం లో కమిటీ ప్రతినిధులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలు ప్రత్యేక ప్రార్థనలు




**గన్నవరం, జనవరి 16, మేజర్ న్యూస్ :** ఓ తండ్రీ ఏసయ్య.. 36రోజులుగా ఆందోళన చేస్తున్నా పాలకులు మాగోడు పట్టించుకోవడంలేదూ..పరులకు మేలు చేయాలని నీవు చెబుతావు.. అమాటను నీ బిడ్డ అని చెబుతున్న సీ ఎం. జగన్ మోహన్రెడ్డి పాటించడం లేదు. అదేమంటే మాపై ఎస్మా ప్రయోగించడానికి సిద్ధమయ్యాడు.. దానిని మేములెక్క చేయకపోవ డంతో కక్ష కట్టి మా సమస్యలుతీర్చడంలేదు.. అయ్యా.. ఇప్పటికైనా ఆయన మ నసు మార్చి తమకు న్యాయం జరిగేలా చూడూ.. ఓప్రభూ.. అని గన్నవరం లోని అంగన్వాడీలు మంగళవారం ఆందోళన శిభిరం వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. మోకాళ్లపై కూర్చుని తలపై చీరకప్పుకుని ఎంతో బాధతో చేసిన ప్రార్ధన చూపరులను ఆలోచింపజేసింది. పండుగ రోజున ఇంటి వద్ద లేకుండా ఆందోళన శిబిరానికి చేరుకుని పాలకుల వైఖరిపై మండిపడ్డారు. ఎంత కాలం ఈవిధంగా చేస్తారో చూ స్తామన్నారు. అంగన్వాడీలతో అడిన ఏప్రభుత్వమూ రాణించలేదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సంఘం నాయకులు రమాదేవి, సిఐటి యునాయకులు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## మైనార్టీలు అంటే సౌమ్యకు చిన్నా చుపా?



**నందిగామ, జనవరి 16, మేజర్ న్యూస్:** మాజీ ఎమ్మెల్యే సౌమ్య పై వైకాపా నాయకులు దుబాయ్ కరిముల్లా మాట్లాడుతూ సౌమ్య నందిగామ పట్టణాన్ని మొండితోక బ్రదర్స్ అభివృద్ధి చేస్తుంటే ఓర్వలేక కోర్టుకెళ్లి అడ్డుకుంటున్నారు.నేను దుబాయ్ నుండి వచ్చి ఇక్కడ పేదవారికి సాయం చేద్దామని ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చాను.మైనార్టీలు నాయకులుగా ఉండకూడదా ఆరో వార్డును మేము అత్యంత సుందరీకరణ గా చేస్తున్నాము మేము అభివృద్ధి చేస్తుంటే మీరు ఓర్వలేక పోతున్నారు.నేను ఏదో స్కామ్ చేశానని ఆరు ఎకరాలు ప్రభుత్వ భూమి రిజిస్ట్రేషన్ చేపించుకున్నాను అని అంటున్నారు దమ్ముంటే నిరూపించండి.ఈరోజు మా ఇంటి మీద దాడి చేయాలని ప్రయత్నించారు ఎప్పుడు మేము మీ జోలికి రాలేదు. మీరు మమ్మల్ని హీనంగా చూశారు ఓటు బ్యాంకు రాజకీయం కోసమే మమ్మల్ని ఉపయోగించుకున్నారు.గతంలో నేను టిడిపిలో ఉన్నప్పుడు మీ బ్యానర్ ఎవరో కట్టకపోతే అర్ధరాత్రి దుబాయ్ నుండి వచ్చి నేను బ్యానర్ కట్టాను మిమ్మల్ని మా దర్గా వద్దకు పిలిస్తే మీరు రాలేదు మమ్మల్ని తక్కువ చూపు చూశారు.మైనార్టీలు ఎదుగుదల మీరు చూడలేకపోతున్నారు మైనార్టీలు అంటే మీకు చిన్న చూపు అన్నారు.

## హరిరామ జోగయ్యని కలిసిన బీజేపీ నేతలు



**మచిలీపట్నం, మేజర్ న్యూస్ :** మాకు అత్యంత ఆప్తులు రాజకీయ సీనియర్ నాయకుడు పూర్వ హోంశాఖ మంత్రి, పెద్దలు చే గొండి హరి రామ జోగయ్యని మంగళవారం పాలకొల్లు వారి నివాసంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకటగజేంద్ర రావు, జిల్లా నాయకులు తోట రంగనాథరావు, చలమల శెట్టి రామకృష్ణ, వేములపల్లి వెంకటరమణ పంతం మణికంత మర్యాదపూర్వకంగా కలిశారు.

# తప్పకుండా న్యాయం జరగాలి





**నందిగామ, జనవరి 18, మేజర్ న్యూస్:** పట్టణంలోని మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య పై పబ్లిక్ మీటింగ్‌లో తేడా, పిచ్చి అంటూ మిమ్స్ వీడియోలు ప్లే చేసిన షేక్ కరిముల్లా అలియాస్ (దుబాయ్ కరిముల్లా) పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలంటూ నిరసన తెలిపారు. తెదేపా మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఫతాఉల్లా,తెదేపా రాష్ట్ర అంగన్వాడీ అధ్యక్షులు ఆచంట సునీత, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాస్ గ తెదేపా జనసేన మహిళ నేతలు, తెదేపా జనసేన నేతల బృందంతో కలిసి మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య కార్యాలయం (ఇంటి) వద్ద నుంచి నందిగామ పోలీస్ స్టేషన్ వరకు కాలినడకన వెళ్లి ఏసిపికి మెమోరాండం మాజీ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్య అందజేశారు. ఈ సందర్భంగా సౌమ్య,నాయకులు మాట్లాడుతూ ఈ నెల 12వ తారీకున ఈ నందిగామ టౌన్ లో జరిగిన ప్రభుత్వ కార్యక్రమం జగ్జీవన్ రావు, బిల్డింగ్ ఓపెనింగ్ గాని అదేవిధంగా జగనన్న వాక్ వే ప్రారంభోత్సవ కార్యక్రమాలకు వైసీపీ మంత్రులు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు అందరూ కూడా హాజరయ్యారు. పబ్లిక్ మీటింగ్ కూడా జరిగినది వాళ్లు చేసుకున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి చెప్పుకోవడం లో తప్పు లేదు. నన్ను కించపరుస్తూ ఒక స్క్రీన్ మీద ఒక మిమ్ వీడియో తయారు చేసి నాకు పిచ్చి తేడా అంటూ పబ్లిక్ లో దుబాయ్ కరీముల్లా అనే వ్యక్తి స్క్రీన్ మీద ప్లే చేశాడు. విష సంస్కృతిని తీసుకువస్తున్నాడు నందిగామలోకి మేము అతని చర్యకు ప్రతి చర్యగా అతని కుటుంబ సభ్యుల మీద పిచ్చి,తేడా అని స్క్రీన్ మీద ప్రదర్శిస్తే ఏమవుతుంది. దీని మీద మేము 13వ తారీకున ఫిర్యాదు చేస్తే నేనొక మాజీ శాసనసభ్యురాలిని పబ్లిక్ మీటింగ్ లో ఈ విధంగా అవమానించారు. నన్ను నాకు పిచ్చి,తేడా అని చెప్పి వీడియో ప్లే చేశారు.దీని మీద యాక్షన్ తీసుకోండి అని చెప్పి పోలీస్ వారికి ఫిర్యాదు ఇస్తే ఇంతవరకు ఎఫ్ఐఆర్ కట్టలేదు ఈరోజు మేము డిఎస్పీకి చెప్తామని వస్తే మేము న్యాయ సలహా తీసుకోవాలని చెప్తున్నారు. వైసిపి వాళ్ల మీద చిన్న పోస్ట్ పెడితేనే సెక్షన్ 3 కడుతున్నారు ఇంత పబ్లిక్ గా ఆధారాలతో సహా పోలీస్ వారికి అందచేస్తే బహిరంగ సభలో పిచ్చి తేడా అని మాజీ శాసనసభ్యురాలని దళితరాలని కించపరిస్తే వీళ్ళకి లీగల్ ఒపీనియన్ కావాలంటా,తప్పకుండా నాకు న్యాయం జరగాలి ఎందుకంటే భవిష్యత్తులో ఈ విష సంస్కృతిని తీసుకువస్తే మాత్రం సమాజం చాలా నాశనం అయిపోతుంది.

ఒక పబ్లిక్ మీటింగ్లో ఒక స్క్రీన్ వేసి చూపించటం అనేది ఎటు దారితీస్తుంది దీని మీద మాత్రం తప్పకుండా చర్యలు తీసుకోవాలి డిఎస్పీని మేము గట్టిగా డిమాండ్ చేస్తున్నాము.నాకు మాత్రం న్యాయం జరగాలి అదేవిధంగా ఈ దుబాయ్ కరిముల్లా ఇంత స్వార్థం ప్రదర్శించడానికి కూడా ఇతను అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రభుత్వ భూములు కాజేయాలని చూస్తున్నాడు.గుడిమెట్లలో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేయాలని దీని మీద ఫైల్ కూడా తయారు చేయడం జరిగినది. ఆర్డిఓ ఇన్స్ట్రక్షన్ కూడా జరిగినది దానికి సంబంధించిన మినిస్టర్ సంతకం కోసం ఆగి ఉంది.దీని సంబందించిన పూర్తి ఆధారాలు త్వరలోనే బయట పెడతాము ఎందుకు ఇతను అంత అత్యుతాహం చూపిస్తున్నాడు అంటే ఈ విధంగా అధికారాన్ని అడ్డుపెట్టుకొని ప్రభుత్వ భూములను కాజేయడానికి చూస్తున్నాడుమళ్లీ ఇతను ఏం చెప్తాడంటే నేను ముస్లిం చైతన్య వేదికను పెట్టాను నేను సమాజానికి చాలా సేవ చేస్తున్నాను అంటూ వెనకనుంచి ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తున్నాడు.ఇది కూడా అతని మీద యాక్షన్ తీసుకోవాలి వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వమే ఈ రోజు మాతో ఏవిధంగా ప్రవర్తించారో రేపు మేము దీనికి పది రెట్లు ఎక్కువ చేసి చుపిస్తాము.చాలా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు వీళ్లు అధికారం శాశ్వతం అనుకుంటున్నారు రెండు నెలలు ఆగితే వాళ్లు ఇటు ఉంటారు మేము అటు ఉంటాము తప్పకుండా వీరికి తగిన బుద్ధి చెబుతాం అన్నారు.

## కరీముల్లా ఇంటిపై దాడికి ప్రయత్నించడం హేయమైన చర్య



**నందిగామ, జనవరి 16, మేజర్ న్యూస్:** ముఖ్యమంత్రిని సైకో సీఎం,ఎమ్మెల్యే –ఎమ్మెల్సీలను వసూల్ బ్రదర్స్, సీఎం సతీమణి భారతమ్మ ని వ్యక్తిగతంగా, అవమానకరంగా మాట్లాడిన జాతీయ నాయకురాలు మీరు కాదా తంగిరాల సౌమ్య అని ఎమ్మెల్సీ అరుణ్ కుమార్ ప్రశ్నించారు. మంగళవారం పత్రిక ప్రకటన ద్వారా తెలుపుతూనందిగామలో వైసీపీ నాయకులు మీమ్స్ ప్రదర్శించారని, కేసు నమోదు చేయాలని, పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేయటం.. వైసీపీ నాయకుడు దుబాయ్ కరీముల్లా ఇంటి మీద దాడికి ప్రయత్నించటం అత్యంత హేయనీయం అన్నారు.ఒక సంవత్సరం కిందట రోడ్ల విస్తీరణ సమయంలో స్వయంగా జాతీయ నాయకురాలు తంగిరాల సౌమ్య ఆమె మాట్లాడిన వీడియోను మొన్న ఆరో వార్డులో నిర్వహించిన సభలో ప్రదర్శించడం జరిగింది. ఒకే సందర్భంలో ఆమె రోడ్లు వేయండి, డ్రైనేజీలు తీయండి అని మాట్లాడుతూ.. ఇది మహానగరమా ? రోడ్లు అవసరమా ? అని మాట్లాడారు.. అదే వీడియోను ప్రదర్శించడం జరిగింది.. అందులో తప్పు ఏముంది అన్నారు.ఒక పరిణితి చెందిన జాతీయ నాయకురాలుగా.. మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఏం మాట్లాడుతుందో అర్థం కాకుండా ఉంది, అని ఒక మీమ్ రూపంలో సోషల్ మీడియా వాళ్లు.. వీడియో పెట్టారు.. అయినా ఆ వీడియో ఒక సంవత్సరం నుంచి ట్రోల్ అవుతూనే ఉంది.. అది కొత్తగా క్రియేట్ చేసింది ఏమీ కాదు,ఆ వీడియోలో ఆమె తేడాగా మాట్లాడుతుంది అని.. పిచ్చి అని మీమ్ విడుదల చేశారు ఐ టీడీపీలో ఇష్టం వచ్చినట్లు మా ఇంట్లో ఆడవాళ్ళ గురించి, మా గురించి ట్రోల్స్ చేయలేదా ? మేము ప్రతిపక్షంలో ఉన్నాం, విమర్శలు చేస్తాం, మీరు కడుక్కోండి అన్నారు కదా.. ఇప్పుడు మీరే కడుక్కోండి.. మీరు చేస్తే ఒప్పు.. మేము చేస్తే తప్పా ? ఒక ఎమ్మెల్యే అయినా మొండితోక జగన్ మోహన్ రావు ఒక డాక్టర్ గా రోడ్డు ప్రమాద బాధితులకి వైద్యం చేస్తుంటే నటన అని మాట్లాడలేదా మీరు అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో సమస్యల మీద, పట్టణంలో సమస్యల మీద ధర్నా చేసి ఉంటే ప్రజలు హర్షించేవారు.. మీ వ్యక్తిగత లాభం కోసం.. దళిత అనే పదాన్ని వాడుకుంటూ.. జాతీయ రహదారిని జాతీయ నాయకురాలు అయిన తంగిరాల సౌమ్య దిగ్బంధం చేయటం హాస్యాస్పదంగా ఉంది.ప్రతిపక్ష నాయకురాలు హుందాగా ప్రవర్తించాలి.. రాజకీయ సిద్ధాంతాల మీద విమర్శలు చేయాలి. మేము ఇచ్చిన హామీలపై.. చేయని పనులపై ప్రశ్నించాలి. మీరు చేయబోయే మంచి ఏంటో ప్రజలకు చెప్పాలి. అంతేకానీ అనవసర విషయాలకు కేసు పెడతాం.. కేసులు కట్టాలి అంటే.. మీరు మాట్లాడిన మాటలపై మేము కూడా 10 కంప్లైంట్ లు ఇస్తాం.. వాటి మీద కూడా పోలీసులు కేసు నమోదు చేయాలి.సంక్రాంతి పండుగ కనుమ రోజు పోలీసులు, విలేకరులు పండుగ చేసుకోకుండా.. ఇదేదో అత్యవసర విపత్తు లాగా చేశారు అన్నారు.



## బాలశౌరి రాకతో జనసేన మరింత బలోపేతం

**మచిలీపట్నం, మేజర్‌న్యూస్ :** మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలసౌరిని జనసేన పార్టీలో చేరు శుభ సందర్భంగా గుంటూరులోని వారి నివాసంలో మచిలీపట్నం జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ వారితనయుడు విజయ్ తో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. అనంతరం మచిలీపట్నం అభివృద్ధి పై ఇరువురు నాయకులు చర్చించారు. ఈ సందర్భంగా బండిరామకృష్ణ మాట్లాడుతూ సౌమ్యుడు స్నేహశీలి బాలశౌరి రాకతో జనసేన పార్టీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. మచిలీపట్నం అభివృద్ధి మరింత సులభతరం అవుతుందని అన్నారు.

# వైభవంగా శ్రీ మల్లేశ్వరస్వామి గ్రామోత్సవము



పెదకాకాని మేజర్ న్యూస్ : సంక్రాంతి పర్వదినము సోమవారము ఉదయం గం.9.00 నుండి శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్లకు సూర్య చంద్ర ప్రభ వాహనముపై గ్రామోత్సవము నిర్వహించినారు. దేవస్థాన సహాయకమీషనరు యన్. శ్రీనివాసరెడ్డి, పాలకమండలి ఛైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, ధర్మకర్తలమండలి సభ్యులు గ్రామోత్సమును ప్రారంభించినారు. గ్రామోత్సవము నందు సంక్రాంతి సాంప్రదాయము ఉట్టి పడ్డే విధముగా ఎడ్లబండ్లు, కొమ్ముదాసర్లు, చెక్క భజన, జంగం దేవరులు మరియు ప్రత్యేక సన్నాయి మేళతాళములతో అత్యంత వైభోపేతముగా పెదకాకాని పుర వీధులలో సూర్య చంద్ర ప్రభ వాహనముపై గ్రామోత్సవము జరిగింది. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. సాయంత్రం గం.3.00ల నుండి ఆలయ ప్రాంగణములో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి పోటీల నందు ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి విజేతలను ఎంపిక చేసినారు. ఆలయ పాలకమండలి ఛైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకమండలి సభ్యులు, గుమ్మళ్ళ వెంకటరావు, గజ్జల సుబ్బాయమ్మ, కారంకి శివనాగేశ్వరమ్మ, మద్దాళి జ్యోతి చేతుల మీదగా విజేతల్కెన మహిళలకు చీరలు, మెమెంటోలను బహుమతిగా అందించినారు.

# కన్నుల పండుగగా అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనం

గుంటూరు, మేజర్ న్యూస్ : మకర సంక్రాంతిని పురస్కరించుకుని అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనం భక్తుల నడుమ అత్యంత కన్నుల పండుగగా జరిగింది. అయ్యప్పస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీనివాసరావుతోటలో సోమవారం మకరజ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి ఉపాసకురాలు శైలజమ్మ, జనసేన పార్టీ నగర అధ్యక్షులు నేరేళ్ళ సురేష్, పత్తిపాడు సమన్వయ కర్త కొర్రపాటి నాగేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి, బీజేపీ నాయకురాలు శ్రావణ కుమారిలు మకరజ్యోతిని వెలిగించారు. ఈ సమయంలో పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. తొలుత అయ్యప్పస్వామి పూజ, పడిపూజ



నిర్వహించారు. సంతోష్ భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తి పాటలు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. సుబ్రహ్మణ్యం, నెల్లూరు రామకోటి వాసు, వేణు, జక్కా రమేష్, నాగేంద్రబాబు, రామిశెట్టి శ్రీను, అడపా రామకృష్ణ, హరి, ఎర్ర బాషా, నాగూర్, షర్ఫుద్దీన్, ఒంగోలు శ్రీను, శేషు, రవీంద్ర, కరీం, బాషా, నీలకంఠం, పులిగడ్డ గోపి, తిరుమలరావు, కోలా మల్లి, చౌదరి శ్రీను, గౌస్, కాసులు, కామేష్, లోకేష్, సాయి పాల్గొన్నారు.

# ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా వైయస్ షర్మిల నియామకంతో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం



పెదకాకాని మేజర్ న్యూస్ : AP PCC అధ్యక్షురాలిగా వైయస్ షర్మిల నియమించడంతో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం ఖాయమని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కంతేటి యలమంద రావు అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్సార్ ఆశయం రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చేయటమే తమ ధ్యేయంగా ముందుకెళ్లాడు అని వైయస్ షర్మిల రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చూడాలని విశిష్టమైన ఆశయంతో వైయస్ కల నెరవేర్చే దిశగా రాహుల్ పాదయాత్రను చూచి ఆకర్షితురాలైనా షర్మిల తెలంగాణలో పెట్టిన వైఎస్ఆర్ టిపి పార్టీని ఇటీవల కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసి మల్లికార్జున కార్గే రాహుల్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరి ఆంధ్రాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెస్తానని తన తండ్రి ఆశయాన్ని నెరవేరుస్తానని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా కష్టపడి పని చేస్తానని ఆమె మనస్ఫూర్తిగా కాంగ్రెస్ పార్టీ లోకి వచ్చారు ఈ సందర్భంగా ఈరోజు ఆమెకు ఆంధ్రప్రదేశ్ PCC ప్రెసిడెంట్ గా నియామక పత్రాన్ని అందుకున్నారు రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా అడుగులు వేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తారని మనస్ఫూర్తిగా షర్మిల రాకను స్వాగతిస్తున్నాము అన్నారు లౌకికవాదానికి మారుపేరుగా నిలిచిన కాంగ్రెస్ పార్టీ తోనే సామాజిక న్యాయం సాధ్యపడుతుందని దేశంలో అన్ని మతాలవారు అన్ని వర్గాల వారు సుఖ సంతోషాలతో ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని జాతీయస్థాయిలో కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడాలంటే రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇలాంటి బహుత్తరమైన బాధ్యతను వైఎస్ షర్మిల శక్తి వంచన లేకుండా నిర్వర్తించి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి గత వైభవాన్ని చేకూర్చాలని కోరుకుంటున్నట్లు ఆయన అన్నారు ప్రస్తుతం భారతదేశము మతతత్వ అరాచక శక్తుల చేతుల్లో నలిగిపోతుందని అరాచక విముక్తి పాలన కోసం కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు ఆంధ్ర ప్రదేశ్ రెండు కులాల మధ్య నలిగిపోతుందని సామాన్య ప్రజలు బడుగు బలహీన వర్గాలు దిక్కుతో తన స్థితిలో ఉన్నాయని రాష్ట్రంలో పెత్తందారీ వ్యవస్థ రాజ్యమేలుతుందని కుల రాజకీయాలతో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తును అధికార దాహంతో కొన్ని రాజకీయ పార్టీలు సర్వనాశనం చేస్తున్నాయని కులాలను తమ ఓటు బ్యాంకుగా మార్చుకోవడానికి యువతను రెచ్చగొడుతున్నారని ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక యువత నిరాశతో నిర్వీర్యం అవుతున్నారని సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ ఏనాడు కుల రాజకీయాలను ప్రోత్సహించలేదని ఆయన అన్నారు కాంగ్రెస్ హయాంలో యువత భవిష్యత్తుకు ప్రత్యేక కార్యచరణలు చేపట్టి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని అన్నారు వైయస్ షర్మిల నాయకత్వంలో రాష్ట్రంలో అధికార మార్పు వస్తుందని అన్నారు ఆంధ్రప్రదేశ్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అది ఒక్క కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యపడుతుందని అన్నారు రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జొన్నల వెంకటరెడ్డి. అగతవరప్పాడు మాజీ సర్పంచ్ తుమ్మ చిన్న పోల్ రెడ్డి .మైనార్టీ సెల్ షేక్ మీరా. కార్యదర్శి K నాగరాజు. షేక్ మొహద్దీన్ భాష. బట్టు మనోజ్. B దిలీప్. అజయ్ దేవ్. వెల్సన్ కుమార్. ఈ కిషోర్ బాబు. మరియు కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు

# బీసీ సంకల్ప సభ పోస్టర్ల ఆవిష్కరణ

మంగళగిరి మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో మంగళగిరి బైపాస్ రోడ్డు లో ఈనెల 18న జరుగనున్న బీసీ సంకల్ప సభ గోడపత్రికలు ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. బీసీల హక్కుల కోసం సభను విజయవంతం చేయాలని పారేపల్లి మహేష్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ కార సంఘ



రాష్ట్ర అధ్యక్షులు కర్రి వేణుమాధవ్, నవ్యాంధ్ర బీసీ సంఘం అధ్యక్షులు జింక దివ్య నారాయణ,మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు వుడతా శ్రీనివాస్, యువజన అధ్యక్షు లు ఆలా శివాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎనుముల నరసింహారావు గుంటూరు పట్టణ అధ్యక్షులు కొమ్మాకుల విజయభాస్కర్ జంజనం వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# తాడికొండ నియోజకవర్గ సీటును మాదిగలకు కేటాయించాలి



తుళ్లూరు మేజర్ న్యూస్ : తాడికొండ నియోజకవర్గ సీటును తెలుగుదేశం పార్టీ మాదిగలకు కేటాయించాలని మాదిగ మహానాడు అధ్యక్షులు బోయినపల్లి ప్రభాకర్ మాదిగ డిమాండ్ చేశారు సోమవారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నిరసన వ్యక్తం చేశారు అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా తాడికొండ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మాదిగలకు సీటు కేటాయింపు జరగలేదని మాదిగలకు సీటు కేటాయిస్తే చంద్రబాబునాయుడుకు గిఫ్టుగా అందజేస్తామన్నారు అమరావతి ఉద్యమంలో కీలకపాత్ర పోషిస్తూ ఉద్యమాలు చేస్తూ కేసులుకు కూడా భయపడకుండా నిరంతరం అమరావతి ఉద్యమం తో పాటు తెలుగుదేశం పార్టీకి సేవలు చేస్తున్న పులిచిన్నాకు తాడికొండ సీటును కేటాయించాలని డిమాండ్ చేశారు. పులి చిన్నా కుతాడికొండ సీటు ఇస్తే మాదిగలంతా ఏకమై గెలిపించి తీరుతామని అన్నారు మాదిగ మహానాడు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు

# 17 నుండి నాటకోత్సవాలు

గుంటూరు మేజర్ న్యూస్ : బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కె.ఆర్.కె. ఈవెంట్స్ ఆధ్వర్యంలో యన్.టి.ఆర్. కళాపరిషత్ నిర్వహణలో ఈనెల 17 నుంచి 19 వరకు 19వ నాటకోత్సవాలు జరుగుతాయని నిర్వహకులు రామకృష్ణప్రసాద్ కాట్రగడ్డ తెలిపారు. 17న టి.జి.వి. కళాక్షేత్రం, కర్నూలు వారిచే శ్రీకృష్ణపాలికలు పద్య నాటకం, 18న పొట్టిశ్రీరాములు, తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాదు వారిచే తెలుగువైభవం నాటిక, గింజుపల్లి శివప్రసాద్‌కు అభినందన సత్కారం, 19న శ్రీ సాయి సంతోషి నాట్యమండలి (సురభి) వారిచే మాయాబజారు పద్యనాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం

**-యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తాయి సుధీర్**



మంగళగిరిటౌన్,మేజర్ న్యూస్: త్వరలో ఏపీ లో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని యువజన కాంగ్రెస్ మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తాయి సుధీర్ అన్నారు.ఏపీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల నియామకం పట్ల మంగళవారం తాయి సుధీర్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర నిర్వహించి ఏపీలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని తెలుగుదేశం పార్టీని మట్టి కరిపించారని గుర్తు చేశారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం సంతోషించిదగ్గ విషయం అయితే ఏపీలో కాంగ్రెస్ పార్టీ పగ్గాలు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె షర్మిలకు అప్పగించటం శుభ పరిణామం అని పేర్కొన్నారు.వైస్సార్సీపీ అరాచక విధానాలతో ప్రజలు విసుగు చెందారని అన్నారు.కాంగ్రెస్ పార్టీ పేదలను ఆదుకునే పార్టీ అని,రాష్ట్రంలో దేశంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసినట్లు గుర్తుచేశారు.అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ హయాంలోనే సాధ్యమని,అందుకే ప్రస్తుతం ప్రజలు కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు. వైఎస్ షర్మిల నేతృత్వంలో ప్రతి ఒక కార్యకర్త రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తారని పేర్కొన్నారు..

## ఘనంగా సంక్రాంతి సంబరాలు



గుంటూరు, మేజర్ న్యూస్ : గుంటూరు తూర్పు నియోజకవర్గం 51 వ డివిజన్ వల్లూరి వారి తోటలో లో శ్రీ భ్రమరాంబికా యూత్ వారి ఆధ్వర్యంలో తినిర్వహిస్తున్న సంక్రాతి సంబరాలలో ముఖ్య అతిథిగా గుంటూరు తూర్పు నియోజకవర్గం ఇంచార్జి మొహమ్మద్ నసీర్ మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గం లో 51 డివిజన్ లో భ్రమరాంబికా యూత్ వారు సంక్రాతి సంబరాలును ఘనంగా నిర్వహించడం అభినందనియమని ఈ సంబరాలలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలకు శుభాకాంక్షలు తెలియ చేసారు రాబోయే సంవత్సరం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే గుంటూరు తూర్పు లో సంక్రాంతి పండుగను మరింత ఘనంగా జరుపుకునే విధంగా చర్యలు తీసుకుంటామని ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేయడం ఆనందంగా ఉందని తెలియజేశారు ఈ కార్యక్రమం లో టీడీపీ కార్పొరేటర్ ముప్పవరపు భారతి, మహంకాలి నరసింహా రావు, %ు% పద్మావతి మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాన్ని అండగా పారేపల్లి మహేష్



మంగళగిరి మేజర్ న్యూస్: మంగళగిరి రత్నాల చెరువు ఎస్టి కాలనీలో పోలమ్మ వెంకటేశ్వరరావు పూరిగుడిస అగ్ని ప్రమాదం వల్ల పూర్తిగా తగలబడి నిరాశ్రయులైయ్యారు. వారి కుటుంబాన్ని బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారే పల్లి మహేష్ మంగళవారం పరామర్శించారు. వారికి వంట సామాగ్రి నిత్యవసర సరుకులు బట్టలు కొంత ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబానికి బీసీ సంక్షేమ సంఘం భరోసాగా నిలిచింది. ఈ కార్యక్రమానికి జిల్లా కోఆర్డినేటర్ కాగితాల స్వాతి గౌడ్, నియోజకవర్గ అధ్యక్షులు కూడా శ్రీనివాస్, యువజన అధ్యక్షుడు ఆల శివాజీ యాదవ్, మంగళగిరి పట్టణ అధ్యక్షులు మంద్రు సత్యనారాయణ, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ కార్ల ధనుంజయ్ దుగ్గిరాల మండల అధ్యక్షురాలు మాదు నాగదుర్గ మధు వెంకటేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎనుముల నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి బల్లలు ధ్వంసంపై తెలుగుదేశం పార్టీ ఆగ్రహం





దుగ్గిరాల, మేజర్ న్యూస్ : దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి పేరు గల పూడి గ్రామంల్లో తెలుగుదేశం పార్టీ యువ నేత నారా లోకేష్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లలను ధ్వంసం చేయడాన్ని, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు .ఒకవైపు గ్రామ ప్రజలు సంక్రాంతి సంబరాలు చేసుకుంటుండగా మరోవైపు గుర్తుతెలియని వ్యక్తులు నారా లోకేష్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన సిమెంట్ బల్ల లను రాత్రి సమయంలో. విద్యుత్తును నిలిపివేసి ధ్వంసం చేయడాన్ని టిడిపి నాయకులు కార్యకర్తలు తప్పుపడుతున్నారు. తుమ్మపూడి ,పేరుగలపూడి గ్రామాల్లో సిమెంట్ బల్ల లను పూర్తిస్థాయిలో ధ్వంసం చేయడాన్ని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు లోలోన మదన పడుతున్నారు .గత వారంలో వైసిపి పార్లమెంటరీ నేత ,పార్టీలో నెంబర్ టూ గా ఉన్న విజయసాయిరెడ్డి స్వయంగా రాజధాని అమరావతి ప్రాంతంలోని మంగళగిరి నియోజకవర్గంలో గల దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామం నకు స్వయంగా వచ్చి వైసీపీని వీడేందుకు రె డీగా ఉన్న నాయకులను భు జ్జగించేందుకు రావడం జరిగింది .అయితే గత 2019 ఎన్నికల్లో వైసీపీ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన, ఆళ్ళ రామకృష్ణారెడ్డి గెలుపొందేందుకు, కృషిచేసి అడుగులు వేసిన నాయకులను ప్రస్తుతం పక్కన పెట్టడంతో, ఆ నాయకులు వైసిపి పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలోకి వెళ్లేందుకు సిద్ధమై అడుగులు వేస్తున్నారని తెలియడంతో విజయసాయిరెడ్డి బు జ్జగించడం జరిగింది. వైసిపి పార్టీ కేడర్ను తను కనుసై గ లతో హెచ్చరికలు జారీ చేసే విజయసాయిరెడ్డి స్వయంగా మండలంలోని చిలువూరు గ్రామానికి వచ్చి ,గ్రామ మండల నాయకులను బ్రతిమలాడి నా ఫలితం లేక తిరిగి వెళ్లార.నే అపవాదితో నే ఇటు వంటి నీతిమాలిన చర్యలకు గుర్తుతెలియని వ్యకు _లు పాల్పడ్డార నే ఆలోచన లు పలుచోట్ల విన వస్తున్నాయి. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ గ్రామాల్లో సిమెంట్. బల్ల లపై. కూర్చుంటారని, సంస్కారం లేని ఇటువంటి వ్యక్తులు కూర్చున్న కొమ్మనే నరికినట్లుగా నారా లోకేష్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన సిమెంటు బల్ల లను పూర్తిస్థాయిలో విరగగొట్టడం పనికిమాలిన చర్యగా అభివర్ణించారు. ప్రశాంత వాతావరణంలో మెలిగే గ్రామాల లో గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయాల్లో ఇటువంటి నీచపు పనులకు శ్రీకారం చుట్టి గ్రామాల్లో దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ,తక్షణమే అటువంటి వ్యక్తులను శిక్షించాలని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు కోరుతున్నారు .ఇటువంటి పనులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు విన్నవించడంతో హుటాహుటిన పోలీసులు పేరుగలపూడి గ్రామానికి వెళ్లి వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది .ఏది ఏమైనా మంగళగిరి నియోజకవర్గంలో జరగబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ యువ నేత నారా లోకేష్ ను ఏ విధంగానైనా ఓడించాలనే. దురుద్దేశంతో పాటు, వైసీపీ నెంబర్ 2 విజయసాయిరెడ్డి గ్రామానికి తరలివచ్చి ,మండల నాయకులను బ్రతిమలాడినా. ఫలితం లేదని, మండల నాయకులు మాట వినలేదనే. నెపంతో ఇటువంటి పన్నాగాలు పన్నుతున్నారని, ఇది మంచి సంస్కృతి కాదనే వాదన గ్రామాల్లో వినవస్తుంది.

# ఉత్కంఠగా కొనసాగుతున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ -2 పోటీలు




యంఎస్‌కె సీసీ డోలాస్ నగర్ వర్సెస్ సైనిక్ లెవెన్ (మంగళగిరి ఇందిరా నగర్) మధ్య జరిగిన మ్యాచ్‌లో యంఎస్‌కె సీసీ డోలాస్ నగర్ జట్టు విజయం సాధించింది. ఆర్‌సీ యూనిక్ క్రికెట్(రత్నాలచెరువు ) వర్సెస్ అంబేద్కర్

మంగళగిరి మేజర్ న్యూస్: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకోని నియోజకవర్గ తెలుగు యువత ఆధ్వార్యాన నారా లోకేష్ క్రీడా ప్రాంగణం(భోగి ఎస్టేట్స్)లో జరుగుతున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్ -2 పోటీలు ఉత్కంఠగా కొనసాగుతున్నాయి. ఎనిమిదవ రోజు అయిన మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 12 జట్ల మధ్య 6 మ్యాచ్‌లు జరిగాయి. వీటిలో

ఫాలోవర్స్ (ఈమని) మధ్య జరిగిన మ్యాచ్‌లో అంబేద్కర్ ఫాలోవర్స్ జట్టు గెలుపొందింది. కేవెల్ రావు కాలనీ కింగ్స్(తాడేపల్లి టౌన్) వర్సెస్ వడ్డేశ్వరం వారియర్స్ మధ్య జరి గిన మ్యాచ్‌లో కేవెల్ రావు కాలనీ కింగ్స్, సీకే జూనియర్స్ వర్సెస్ నవులూరు లెజెండ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో నవులూరు లెజెండ్స్ జట్టు, బెంజి వర్సెస్ జేకేసీ మధ్య జరిగిన మ్యాచ్‌లో బెంజి జట్టు, వారాహి వారియర్స్ (మంగళగిరి టౌన్ ) వర్సెస్ సీహెచ్‌వి పాలెం అంబేద్కర్ యూత్ (చుక్కపల్లి వారి పాలెం) మధ్య జరిగిన మ్యాచ్‌లో సీహెచ్‌వి పాలెం అంబేద్కర్ యూత్ జట్లు విజయం సాధించాయి. ప్రతీ మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారుడికి తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్ చంద్ సహకారంతో రూ.రెండు వేల నగదు బహుమతి, ట్రోఫీ, క్రీడాకారులందరికీ ప్రశంసా పత్రాలను అందజేశారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ. 2 లక్షలను నియోజకవర్గ తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మంచికలపూడి వైష్ణవి మరియు మాలపాటి పుల్లయ్య చౌదరి, ద్వితీయ బహుమతి రూ. లక్షను సీనియర్ నాయకులు ఇట్టా పెంచలయ్య, తృతీయ బహుమతి రూ. 50 వేలను యర్రబాలెం టీడీపీ గ్రామ కమిటీ ఆర్థిక సహకారంతో అందించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

# ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల నియామకం

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీ పీసీసీ) అధ్యక్షురాలిగా అంతా ఊహించినట్టే వైఎస్ షర్మిల నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటన విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీ పీసీసీ) అధ్యక్షురాలిగా అంతా ఊహించినట్టే వైఎస్ షర్మిల నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటన విడుదల చేసింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని వెల్లడించింది. ఇప్పటి వరకు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన గిడుగు రుద్రరాజును పార్టీ అత్యున్నత నిర్ణాయక విభాగం.. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. కాగా తెలంగాణలో రాజన్న రాజ్యం తెస్తానని వైఎస్




షర్మిల వైఎస్సార్ తెలంగాణ పార్టీని ఏర్పాటు చేశారు. 3600 కిలోమీటర్లు తెలంగాణలో పాదయాత్ర చేశారు. అయినా ఒక్క పేరున్న నేత కూడా ఆమె పార్టీలో చేరలేదు. చివరకు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఆమె పోటీ చేయలేకపోయారు. తాము పోటీ చేస్తే ఓట్లు చీలిపోతాయని.. అందుకే తాము ఎన్నికల్లో పోటీ చేయడం లేదని తెలిపారు. వాస్తవానికి తెలంగాణ ఎన్నికల ముందే షర్మిల కాంగ్రెస్ అధిష్టానంతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ పార్టీ తరఫున ఖమ్మం జిల్లాలోని పాలేరు నుంచి లేదా సికింద్రాబాద్ నుంచి పోటీ చేయొచ్చని ప్రచారం జరిగింది. అయితే తెలంగాణలో పోటీకి అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో షర్మిల పోటీ చేయలేకపోయారు. షర్మిల సేవలను ఏపీలో వాడుకోవాలని నిర్ణయించడం వల్లే తెలంగాణ లో ఆమెకు ఎలాంటి అవకాశం లేదని అప్పట్లో వార్తలు వినిపించాయి. ఆ వార్తలకు తగ్గట్టే షర్మిలను ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా నియమించారు. షర్మిల తన భర్త అనిల్ కుమార్ తో కలిసి ఇటీవల కాంగ్రెస్ లో చేరి ఆ పార్టీని విలీనం చేశారు. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. షర్మిల కాంగ్రెస్‌లో చేరినప్పుడే ఆమెకు ఏపీ బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం జోరుగా జరిగింది. దీనికి తగ్గట్టే ఏపీ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న గిడుగు రుద్రరాజు తన పదవికి రాజీనామా చేశారు. షర్మిల రాకను ఆయన గతంలోనే స్వాగతించారు. గిడుగు రుద్రరాజు రాజీనామాతో ఏపీ పీసీసీకి అధ్యక్ష పదవికి అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం వైఎస్ షర్మిలను ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా నియమించింది. మరోవైపు జనవరి 18న షర్మిల కుమారుడు రాజారెడ్డికి ఇండీస్ రెస్టారెంట్ల అధినేత మనుమరాలు అట్లూరి ప్రియతో నిశ్చితార్థం జరగనుంది. ఫిబ్రవరి 17న వివాహం జరగనుంది. ఈ పెళ్లి పనుల్లో షర్మిల బిజీగా ఉన్నారు. ఇప్పటికే పలువురు అతిథులను ఆమె ఆహ్వానించారు. కాగా వచ్చే ఎన్నికల్లో షర్మిల కడప లోక్ సభ స్థానం నుంచి లేదా పులివెందుల అసెంబ్లీ నుంచి పోటీ చేయొచ్చని అంటున్నారు.

## హరిదాసు వేషధారణలో సర్పంచ్ వినూత్న నిరసన

గుంటూరు, మేజర్ న్యూస్ : వట్టిచెరుకూరు మండలం కాట్రపాడు సర్పంచ్ మేదరమెట్ల శంకర్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు హరిదాసు వేషధారణతో సోమవారం భిక్షాటన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల నుంచి తీసుకున్న నిధులను తిరిగి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. నిధులు లేకపోవడంతో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేకపోతున్నామన్నారు. పంచాయతీ కార్యాలయం కూడా సగానికి పైగా పగుళ్లు వచ్చాయని.. దీనికి మరమ్మతులు నిర్వహించాలని కోరారు.

# టీడీపీతో బీజేపీ పొత్తు - ఢిల్లీ తాజా సంకేతాలు?

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : ఏపీలో పొత్తుల రాజకీయంలో కొత్త ట్విస్ట్. ఇప్పటికే పొత్తు ఖాయం చేసుకున్న టీడీపీ, జనసేన తమతో బీజేపీ కలిసి వస్తుందని అంచనా వేస్తున్నాయి. ఇటు కాంగ్రెస్ ఏపీలో యాక్టివ్ అవుతున్న వేళ బీజేపీ ఎన్నికల పొత్తుల పై కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఏపీలోని బీజేపీ నేతల నుంచి అభిప్రాయ సేకరణ చేసింది. ఈ నెలలోనే పొత్తు పైన బీజేపీ నుంచి సానుకూల నిర్ణయం వస్తుందని భావిస్తున్న వేళ...ఢిల్లీ నుంచి అందుతున్న సంకేతాలు భిన్నంగా ఉన్నాయి.

పొత్తుల లెక్కలు : ఏపీలో 2014లో బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీ చేసాయి. 2019 ఎన్నికల ముందు టీడీపీ ఎన్డీఏ నుంచి బయటకు వచ్చింది. ఇప్పుడు ఎన్డీఏలో భాగస్వామిగా ఉన్న జనసేన ఏపీలో టీడీపీతో జత కట్టింది. బీజేపీ తమ రెండు పార్టీలతో కలిసి రావా లని జనసేనాని పలు సందర్భాల్లో అభ్య ర్థించారు. బీజేపీ ఏపీలో నేతల అభి ప్రాయ సేకరణ చేసినా..ఇప్పటి వరకు పొత్తు పైన తమ వైఖరి ఏంటో స్పష్టత ఇవ్వలేదు. ఈ నెల 22 న అయోధ్యలో రామ మందిరం ప్రారంభం తరువాత రాజకీయంగా బీజేపీ నిర్ణయాలు తీసుకుంటుందని చెబుతున్నారు. అందులో భాగంగా ఏపీలో పొత్తుల పైన క్లారిటీ వస్తుందని భావిస్తున్నారు. సీట్ల ఖరారు అంశంలోనూ బీజేపీ నిర్ణయం కోసం టీడీపీ, జనసేన వేచి చూస్తున్నాయి.

బీజేపీ కొత్త వ్యూహాలు : అయితే, తెలంగాణ ఎన్నికల్లో ఒంటరిగా వెళ్లటం ద్వారా సీట్లు, ఓట్లు పెరిగిన అంశాన్ని పార్టీ నేతలు కొందరు గుర్తు చేస్తున్నారు. ఏపీలో పొత్తుల కారణంగానే ఇప్పటి వరకు పార్టీ ఎదుగుదల లేకుండా పోయిందనే అభిప్రాయం సీనియర్లు పార్టీ అధినాయకత్వం వద్ద ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఏపీ నేతల నుంచి సేకరించిన అభిప్రాయాల పైన బీజేపీ పార్లమెంటరీ కమిటీ చర్చించి ప్రధాని మోదీకి నివేదిక ఇవ్వనుంది. ప్రధాని మోదీ ఏపీలో పొత్తుల పైన తుది నిర్ణయం తీసుకోనున్నారు. ఇదే సమయంలో ఏపీలో బీజేపీ వ్యూహాత్మకంగా పావులు కదుపు తోంది. 25 లోక్ సభ స్థానాల్లో పోటీ చేసే అభ్య ర్థుల ఆశావాహుల సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. వీరికి ఏ మేర ప్రజా మద్దతు ఉందనే అంశం పైన సర్వే చేయిస్తున్నట్లు సమాచారం

పొత్తు ఉండేనా : దీని ద్వారా బీజేపీ ఇటు పొత్తు అంశం పెండింగ్ లో ఉంచుతూనే..అటు సొంతంగా పోటీ చేయటం పైనా ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒంటరిగా పోటీ చేయటం ద్వారా ఎలాంటి ప్రభావం ఉంటుంది.. పొత్తుతో వెళ్తే కలిగే ప్రయోజనం పైన కసరత్తు చేస్తున్నట్లు కనిపిస్తోంది. బీజేపీ పొత్తు పైనా టీడీపీలోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. బీజేపీతో వెళ్లటం ద్వారా కొన్ని వర్గాల ఓటింగ్ దూరం అవుతుందనే ఆందో ళన కొందరు నేతలు వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ మద్దతు లేకపోతే ఎలక్షనీరింగ్ లో వైసీపీని ఎదుర్కోవటం కష్టమేనే వాదన మరి కొందరిది. దీంతో, బీజేపీ అధినాయకత్వం తుది నిర్ణయం ఎలా ఉంటుంది.. పొత్తు ఖరారైతే ఎలాంటి ఫలితం ఉంటుందనేది ఇప్పుడు ఆసక్తి కరంగా మారుతోంది.

# లోడ్ బాదుడు - విద్యుత్ శాఖ వింత పోకడ

గుంటూరు జిల్లా, నేటి దినపత్రిక సూర్య బ్యూరో : గత నాలుగేళ్లలో ఏడు పర్యాయాలు విద్యుత్ చార్జీలు పెంచి సామాన్యుల నెత్తిన శఠగోపం పెట్టిన ప్రభుత్వం అదనపు లోడు అంటూ వింత పోకడకు తెరతీసింది. ట్రూఅప్, డెవలప్మెంట్, సెక్యూరిటీ, కస్టమర్ ఇలా అనేక రకాల విద్యుత్ చార్జీల మోత మోగిస్తోంది. తాజాగా ఎఫ్పీపీసీఏ పేరుతో షాక్ కొట్టే విధంగా కరెంటు బిల్లులు ఉంటున్నాయి. ఇది చాలదన్నట్లుగా అదనపు లోడు అంటూ నెలలో నాలుగు పర్యాయాలు డివిజన్ స్థాయిలో అధికా రులు దాడులు నిర్వహించి విద్యుత్ వినియోగ దారులపై మరింత భారం మోపుతున్నారు. డిపాజిట్ చెల్లించిన దానికంటే అదనంగా విద్యుత్ వినియోగిస్తున్నారంటూ మరో బాదుడు ప్రారంభించారు. ఏకంగా ఫైన్లు వేస్తున్నారు. డిపా జిట్లు కట్టాలంటూ బెదిరిస్తున్నారు. ఇప్పటివరకు ఒక కిలోవాట్ ఉంటే రెండు కిలోవాట్లకు, రెండు ఉంటే మూడుకు, మూడు ఉంటే ఏకంగా ఐదు కిలో వాట్లకు నోటీసులు పంపుతున్నారు. వినియో గదారులతో బలవంతంగా డిపాజిట్లు కట్టిస్తున్న పరిస్థితి. ఇలా ప్రతి డివిజన్లో నెలకు నాలుగు పర్యాయాలు అధికారులు ప్రత్యేక దాడులు నిర్వహించి ప్రజలనుహడలెత్తిస్తున్నారు. ఇప్పటికే కరెంటు బిల్లుల మోత మోయలేక అల్లాడుతున్న ప్రజలను ఈ 'అదనపు' బాదుడు మరింత భయపెడుతోంది. కాగా కనెక్షన్కు సంబంధించి కిలోవాట్లు పెరిగితే ఆమేరకు యూనిట్ ధర, ఇతర చార్జీలుపెరుగుతాయేమోనన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా వాడినా వాడకపోయినా అదనపు లోడే అని చెబుతున్నారు. వినియోగదారులు విద్యుత్ కనెక్షన్ తీసుకునే సమ యంలో 1 కిలోవాట్ వినియోగం అని దరఖాస్తు చేసుకుం టారు. అయితే అవసరాల రీత్యా వాడకం పెరిగితే అలాంటి కనెక్షన్లను పరిశీలించి అదనపులోడు ఉన్నట్లు గుర్తించి జరిమానాలు విధించడంతోపాటు వారి వద్ద కిలోవాట్కు రూ.2,200 చొప్పున డిపాజిట్ రూపంలో వసూలు చేస్తారు. ఉదాహరణకు ఒక కిలోవాట్ వినియో గం కింద విద్యుత్ కనెక్షన్ తీసుకొని సరాసరిన నెలకు 300 యూనిట్లకుపైగా వినియోగిస్తున్న వారు అదనంగా మరో రెండు కిలోవాట్లకు రూ.4,400




చెల్లించాలి. అలాకాకుండా కొన్నిచోట్ల ఇళ్లపై దాడులు చేస్తున్న విద్యుత్ అధికారులు గృహాల్లో ఎన్ని వస్తువులు ఉంటే అన్నింటికీ లెక్క కట్టి మొత్తం అదనపు భారం అంటూ తేల్చేస్తున్నారు. అయి తేవినియోగదారులు కొన్ని వస్తువులను తాము ఎప్పుడో ఒకసారి వాడతామని, కొన్ని అసలు వాడ మని చెప్పినా వినని పరిస్థితి. కొందరు అధికారులైతే ఇదేమని అడిగిన వారిని కనెక్షన్లు కట్చేస్తామనిబెదిరిస్తున్నారు.

**-అద్దెదారులకు కరెంట్ కష్టాలు**

అద్దె ఇళ్లలో ఉంటున్న వారికి ఈ ట్రూఅప్ చార్జీలు, ఇంధన సర్దుబాటు చార్జీలు చెల్లించడం తలనొప్పిగా మారింది. 2014-19 మధ్యలో వినియోగించిన విద్యుత్కు సంబంధించి ట్రూఅప్ చార్జీలు, 2021 జూలై నుంచి వచ్చే ఇంధన సర్దుబాటు చార్జీలు ప్రస్తుతం ఇంట్లో అద్దెకు ఉండేవారు కట్టాల్సి వస్తోంది. గతంలో అద్దెకు ఉన్నవారు వాడిన కరెంట్కు తామెలా చార్జీలు కడతామంటూ చాలాచోట్లఅద్దంతిరుగుతున్న పరిస్థితి. దీంతో యజమా నులకు, అద్దెకు ఉండే వారి మధ్య వివాదాలుచోటుచేసుకుంటున్నాయి.

**-కస్టమర్ చార్జీలు**

వినియోగదారులకు ప్రతినెలా బిల్లుల్లో ఐదు రకాల చార్జీలను వేస్తున్నారు.ట్రాన్స్ఫార్మర్లు, సబ్ స్టేషన్ల నుంచి వైర్ల ద్వారా ఇళ్లకు కరెంట్ సరఫ రా చేసినందుకు కస్టమర్ చార్జీలు వసూలు చే స్తారు. ప్రతినెలా వాడుకున్న యూనిట్లను పరిగ ణనలోకి తీసుకొని ఈచార్జీ రూ.25 నుంచి రూ.55 వరకు విధిస్తారు. అయితే ప్రస్తుతం ఇది అందరి నుంచి గరిష్ఠంగా రూ.55 వసూలు చేస్తున్నారు.

**- ఫిక్స్డ్ చార్జీలు**

విద్యుత్ సరఫరాకు సబ్స్టేషన్లు, స్తంభాలు, వైర్లు వంటి పెద్ద ఎస్టాబ్లిష్మెంట్ ఉంటుంది. అందుకు సంబంధించి అయ్యే ఖర్చును కూడా వినియోగదారుల నుంచి నెలవారీ బిల్లులో ఫిక్స్డ్ చార్జీల రూపంలో వసూలు చేస్తున్నారు. ఒక కిలోవాట్కు పది రూపాయల చొప్పున ప్రతి నెలా బిల్లులో పిండుకొంటున్నారు. ఎన్ని కిలోవాట్ల వినియోగం ఉంటే అన్ని రూ.10 చొప్పున నెలనెలా వసూలు చేస్తున్నారు.

**-ఎలక్ట్రిసిటీ డ్యూటీ**

ఇది ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్పెషల్గా వసూలు చేస్తున్న పన్ను. గృహ అవసరాలకు యూనిట్కు 6 పైసలు, కమర్షియల్కు ఒక రూపాయి చొప్పున పిండుతున్నారు.

**-ఎఫ్పీపీసీఏ చార్జీలు**

ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్మెంట్ (ఇంధన సర్దుబాటు) చార్జీల పేరుతో జూలై 2021 సంబంధించి, జూన్ 2023 నుంచి ఇలా రెండు రకాలుగా ఇంధన సర్దుబాటు చార్జీలు వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. మొత్తంగా ఈ అదనపు చార్జీల భారం అసలు వినియోగించిన యూనిట్ల (ఎనర్జీ చార్జ్) మొత్తమంత వస్తుండటంతో వినియోగదారులు లబోదిబోమంటున్నారు.

**-పదేపదే ట్రూఅప్ చార్జీలు**

2014-19 మధ్యలో వినియోగించిన మొత్తానికి, ఆయా సంస్థల నుంచి కొనుగోలు చేసిన మొత్తానికి ఉన్న తేడాను తేల్చారు. అందుకు సంబంధించి ఆ మధ్య కాలంలో వాడిన విద్యుత్ సరాసరిన విభజించి 2022 జూలై నుంచి 2025 జూలై వరకు మూడేళ్లపాటు యూనిట్కు 22 పైసలు చొప్పున వినియోగదారుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. తాజా మరోసారి ట్రూఅప్ బాదుడు ప్రారంభించారు. జూలైలో విని యోగానికి సంబంధించిన ప్రస్తుతం ఇస్తున్న బిల్లుల్లో వీటిని కలపడంతో వినియోగ దారులు బెంబేలెత్తిపోతున్నారు.

# అంగన్వాడిలకు అండగా ఉంటాం - సిపిఎం



పెదనందిపాడు మేజర్ న్యూస్ : రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా పెదనందిపాడు లో అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 36వ రోజుకు చేరిన సందర్భంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి మాట్లాడుతూప్రభుత్వం అంగన్వాడీలకు 26 వేల జీతం ఇవ్వాలని , సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రా ట్యూటీ ఇవ్వాలని ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాల అమలు చేయాలని కోరికల సాధించేవరకు సమ్మె చేయాలని ఈ సమ్మెకు ప్రజా సంఘాల మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిఐటియు జిల్లా నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, రైతు సంఘాల నాయకులు ఎం. వెంకటేశ్వర్లు జంపని రామారావు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి దేవరకొండ శ్రీనివాసరావు ,మండల అధ్యక్ష కార్యదర్శులు శివపార్వతి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

# బాబోయ్ బియ్యం కొనలేం

గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో : బియ్యం ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. కొంతమంది బియ్యం వ్యాపారులు మార్కెట్లో కొరత సృష్టించి ధరలు అనూహ్యంగా పెంచుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఏడాది మన జిల్లాలో పండిన వరి ధాన్యం పెద్ద ఎత్తున పొరుగు రాష్ట్రాలకు తరలిపోయినట్లు దీనివల్ల మార్కెట్లో ధాన్యం కొరత ఏర్పడటం, నిల్వలు తరిగిపోతుండటంతో ధరలు అంతకంతకూ పెరుగుతున్నాయి. సన్నరకాలు కిలో బియ్యం ధర టోకు మార్కెట్లో కిలో రూ.54 నుంచి రూ.58 వరకు విక్రయిస్తున్నారు. టోకు మార్కెట్లో బీపీటీ పాత బియ్యం కిలో రూ.55, కొత్తవి రూ.52, హెచ్ఎంటీ రకం కిలో రూ.56, జేజీఎల్ కిలో రూ.57 వంతున అమ్ముతున్నారు. టోకు వ్యాపారుల నుంచి రిటైల్ వ్యాపారులు వినియోగదారులకు అమ్మేసరికి కిలోకు రూ.2 నుంచి రూ.4 వరకు పెంచి విక్రయిస్తున్నారు. కొన్ని రకాలు వివిధ బ్రాండ్ల పేరుతో కిలో రూ.61కు విక్రయిస్తున్నారు. సాధారణ రకాల బియ్యం కిలో రూ.52 ధర పలుకుతుండటంతో సామాన్యులు కొనుగోలు చేయలేక అల్లాడిపోతున్నారు. మార్కెట్లో ధాన్యం నిల్వలు తరిగిపోవడం, సన్నరకాల బియ్యం కొరత ఉండటంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. చేబ్రోలు ప్రాంతానికి చెందిన మిల్లు యజమాని ఒకరు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని ధరలు ఈసారి చూస్తున్నామన్నారు. అయినప్పటికీ నాణ్యమైన ధాన్యం నిల్వలు లేక ఇబ్బందులు పడుతున్నామ న్నారు. గతేడాది నిల్వచేసిన వ్యాపారులకు పెద్దగా లబ్ధి చేకూరకపోవడంతో ఈసారి నిల్వలపై ఆసక్తి చూపలేదన్నారు. గ్రామాల్లోనూ రైతులు వద్ద నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయన్నారు. మూడు నెలలుగా ఇదేవిధంగా ఉందని చెప్పారు ఉమ్మడి గుంటూరు జిల్లాలో గతేడాది ఖరీఫ్ సీజన్, రబీ సీజన్లో ధాన్యం ఎక్కువగా తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు తరలిపోయింది. అక్కడి వ్యాపారులు వచ్చి గుంటూరు జిల్లాలోని కృష్ణా డెల్టా ఆయకట్టు పరిధిలో విస్తారంగా పండిన సన్నరకాల ధాన్యం కొనుగోలు చేసి తీసుకెళ్లిపోయారు. ఇక్కడి మిల్లర్లు కూడా ఎక్కువగా నిల్వ చేయడానికి ఆసక్తి చూపలేదు. పల్నాడులో పెద్ద రైతులు ధాన్యాన్ని గోదాముల్లో, డెల్టాలో పురులలో నిల్వ చేసేవారు. ఈఏడాది నిల్వచేసిన రైతులు సంఖ్య బాగా తగ్గింది. దీనికితోడు ఖరీఫ్ సీజన్ పంట కోత సమయంలో వచ్చిన వర్షాల వల్ల ధాన్యం నాణ్యత దెబ్బతింది. దీంతో రైతులు అప్పట్లో అమ్ముకోవడానికే మొగ్గుచూపారు. రబీ సీజన్లో పల్నాడు జిల్లాలో పరిమితంగా వచ్చిన ధాన్యాన్ని తెలంగాణ వ్యాపారులు ఎక్కువగా కొనుగోలు చేసి తీసుకెళ్లారు. దీంతో గత మూడు నెలలుగా ఇక్కడ ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం నెల్లూరు జిల్లాలో ఇప్పుడిప్పుడే కోతలు మొదలయ్యాయి. అక్కడి ధాన్యాన్ని తమిళనాడు, తెలంగాణ వ్యాపారులు కొనుగోలు చేసి తీసుకెళ్లడానికి సిద్ధమయ్యారు. అక్టోబరు చివరి నాటికి తెలంగాణలో ధాన్యం మార్కెట్కు వచ్చే అవకాశం ఉంది. సాగర్ కాలువల కింద ఈసారి నీటి కొరతతో వరి సాగు బాగా తగ్గిపోయింది. గతంలో మాదిరి బోరుబావుల కింద మాత్రమే సాగులోకి వచ్చింది. డెల్టాలోనూ ఈసారి కొంత వరకు వరి సాగు విస్తీర్ణం తగ్గిందని వ్యవసాయ శాఖ అధికారుల లెక్కల బట్టి తెలుస్తుంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని బియ్యం ధరలు మరింత పెరుగుతాయని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. పెరుగుతుండటంతో కొందరు వ్యాపారులు కొనుగోలుదారులను మోసం చేస్తున్నారు. ప్రజలు ఎక్కువగా పాత బియ్యం తినడానికి ఇష్టపడటంతో కొత్త బియ్యంలో కొంత పాత బియ్యం కలిపి మొత్తం పాత బియ్యం బస్తాలు అని అమ్మేస్తున్నారు. పాత, కొత్త బియ్యానికి కిలోకు రూ.5 వరకు తేడా ఉండటంతో కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.

## ఇంజనీరింగ్ విద్యతో ఆటలు !



గుంటూరు, మేజర్ న్యూస్ : పిల్లల ప్రైమరీ స్కూల్లో ఏడాది పాటు ఫీజు ఎంత ఉంటుంది ? ఓ మాదిరి స్కూల్లో అయితే కనీసం నలభై వేలు ఉంటుంది. అదే కార్పొరేట్ స్కూల్లో అయితే రూ. లక్ష ఉంటుంది. ఇక ఒకటో తరగతికే వస్తే.. ఓ మాదిరి స్కూల్లోనూ కనీసం రూ. 70వేలు వసూలు చేస్తారు. ఇంత వసూలు చేస్తేనే తాము విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయగలుగుతామని విద్యా సంస్థలు చెబుతాయి. కానీ ఏపీలో ఇంజినీరింగ్ కు ప్రభుత్వం ఖరారు చేసిన ఫీజు ఎంతో తెలుసా%ాా% రూ. 70వేలే. ఇంత కంటే ఎక్కువ ఫీజు వసూలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించింది. ఒకటో తరగతి స్థాయికి ఇంజనీరింగ్ విద్య ప్రమాణాలు ఇంజినీరింగ్ విద్య అత్యంత కీలకమైనది. విద్యార్థిలో సృజనాత్మకత అప్పుడే బయట పడుతుంది. దేశానికి పనికి వచ్చే ఆవిష్కరణలకు ఆలోచనా బీజాలు అక్కడే పడాలి. అందు కోసం.. ఎన్నెన్నో సౌకర్యాలను ఇంజనీరింగ్ కాలేజీలు కల్పించాలి. విద్యార్థుల ఆలోచనలకు తగ్గట్లుగా ఎప్పటికప్పుడు ఆవిష్కరణలు చేయగలిగే వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ఇలాంటి మౌలిక సదుపాయాలు ఒక్క రోజులో రావు. క్రమంగా ఏర్పాటు చేసుకోవాలి. కానీ ఇప్పుడు ఫీజులను నియంత్రించేయడం%ాా% మరీ దారుణంగా స్కూల్ ఫీజుల్లా ఖరారు చేయడంతో ఇంజినీరింగ్ కాలేజీల యాజమాన్యాలు కూడా భారం తగ్గించు కుంటున్నాయి. విద్య ప్రమాణాలను తగ్గించేస్తున్నాయి. ఫీజుకు తగ్గట్లుగానే నాసిరకం చదువులు ! ప్రభుత్వం అత్యంత తక్కువ ఫీజులు పెట్టడంతో చాలా కాలేజీలు మూతబడ్డాయి. వందకుపైగా కాలేజీల్లో అడ్మిషన్లు జరగడం లేదు. ఫీజులు ఏ మాత్రం గిట్టుబాటు అయ్యే అవకాశం లేకపోవడంతో వీలైనంత తక్కువ ఖర్చుతో పని పూర్తి చేయాలని%ాా% నాసిరకం విద్యకు ప్రాధాన్యం ఇచ్చే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీని వల్ల విద్యార్థుల బంగారు భవిష్యత్ దెబ్బతింటోంది. ఫీజు రీఎంబర్స్ మెంట్ భారం తగ్గించుకోవడానికి విద్యార్థుల జీవితతో ఆటలు ఫీజు రీఎంబర్స్ మెంట్ భారం తగ్గించుకోవడానికే ప్రభుత్వం కాలేజీ ఫీజుల్ని తగ్గించిందన్న ఆరోపణలు వస్తున్నాయి. నిజానికి ఇక్కడా తేడాలు ఉన్నాయి. వైసీపీ నేతల గుప్పిట్లో ఉండే విద్యాసంస్థలకు ఓ ఫీజు.. ఇతరులకు మరో ఫీజు ఖరారు చేశారు. ఇక్కడా సామాజికవర్గ కోణం ఉంది. మనోడయితే.. ఆ కాలేజీల్లో ఫీజులు ఓ రేంజ్ లో నిర్ణయిస్తారు. లేదంటే.. పాతాళంలో ఖరారు చేస్తారు. ఇంకా "ఎగస్పార్టీ" వాళ్లయితే అనుమతులు కూడా ఇవ్వరు. పొరుగు రాష్ట్రాలకు అత్యధిక వలస హైదరాబాద్, చెన్నై, బెంగళూరుని ప్రముఖ కాలేజీలు, ప్రైవేటు యూనివర్సిటీల్లో చదివేవారిలో తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లే వారు ఎక్కువగా ఉంటున్నారు. ఏపీలో మంచి కాలేజీలు .. ఉంటే అక్కడే జాయిన్ చేసుకునేవారు. కానీ%ాా% ఇంజినీరింగ్ విద్య నిర్వీర్యం కావడంతో చాలా మంది పొరుగు రాష్ట్రాలకు వెళ్తున్నారు. ఏపీలో ఉన్న విట్, కేఎల్ , విజ్ఞాన్ వంటి ప్రైవేటు యూనివర్శిటీల్లో సీట్లకు తీవ్ర పోటీ ఉంటోంది.

## ధార్మిక విద్యతో మరింత జ్ఞానార్జన

గుంటూరు, మేజర్ న్యూస్ : చిన్నతనం నుంచి చదువులతో పాటు ధార్మిక విద్యను కూడా అభ్యసించాలని, తద్వారా మరింత జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని జనాబ్ అబ్దుర్రహ్మాన్ అన్నారు. మంగళగిరి - తాడేపల్లి కార్పొరేషన్ పరిధి యర్రబాలెం బసవ తారక నగర్ మస్జిద్ -ఎ- మొహమ్మద్ లో రెండు రోజుల పాటు ధార్మిక శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఇల్మ్ ప్రాముఖ్యత పై అబ్దుల్ హఫీజ్ ఉమ్రీ, బిద్ ఆత్ పర్యవసానం అనే అంశంపై అబ్దుల్ మాబూద్ జామిఈ, సున్నత్ ప్రాముఖ్యత పై అబ్దుల్లా జామిఈ, షిర్క్ (బహుదైవారాధన) అనే అంశంపై ఇల్యాస్ దాయీ, ఉలమాయే దీన్ కి ఫజీలత్ అనే అంశంపై ఫయాజ్ అలమ్ ఆల్యావి లు ప్రసంగించారు. ముఖ్య అతిథిగా హాజరైన జనాబ్ అబ్దుర్రహ్మాన్ మాట్లాడుతూ ముస్లిం లు మసీదులను సుందరంగా నిర్మించడం ప్రధానం కాదని, దైవభీతి తో నమాజ్ లు ఆచరించాలన్నారు. ప్రాపంచిక పరమైన వ్యామోహం కారణంగా ధర్మం గురించి సరైన అవగాహన ఉండటం లేదన్నారు. సృష్టి కర్త కోరుకున్న జీవన విధానాన్నే ఇస్లాం అంటారన్నారు. ముస్లిం అంటే సయ్యద్, షేక్, పఠాన్, ఖాన్ కాదని, దైవ ప్రసన్నత కోసం తనను తాను అర్పించుకున్న వ్యక్తే ముస్లిం అన్నారు. ముస్లిం అంటే విధేయుడు అని, తల్లి గర్భంలో తనను తయారు చేసిన లోకాల స్వామికి విధేయత చూపేవాడన్నారు. పరలోక జీవితంపై భయంతో జీవించే వాడే ముస్లిం అన్నారు. ప్రాపంచిక జీవితం మనుషులను మోసాలకు గురి చేస్తుందని, డబ్బు సంపాదనే మనిషికి ధ్యేయంగా మారిందన్నారు. డబ్బు కోసమే బ్రతుకుతున్నారని, డబ్బు కోసమే చనిపోతున్నారన్నారు. ఎంతో మంది కోటీశ్వరులు సైతం చనిపోయారని, మనం కూడా ఏదో ఒక రోజు భూమి పై నుంచి వెళ్లిపోతామనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తెరగాలన్నారు. తల్లి గర్భంలో ఎలా ఒంటరిగా వచ్చామో...తిరిగి అలాగే ఒంటరిగా వెళ్లిపోతామన్నారు. ప్రాపంచిక జీవితం ఒక నీటి బిందువు వంటిదైతే పరలోక జీవితం సముద్రం వంటిదన్నారు. మరణానంతరం అసలైన జీవితం మరొకటి ఉందని, అక్కడ కోరుకున్న సుఖాలతో చిరకాల జీవితం గడపవచ్చునన్నారు.

# టీడీపీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



మంగళగిరి మేజర్ న్యూస్: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సౌజన్యంతో మంగళగిరి పట్టణం19, 20 వార్డులలో సంక్రాంతి సంకల్పం పేరుతో మాజీ కౌన్సిలర్ బట్టు చిదానందశాస్త్రి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ముగ్గుల పోటీలు నిర్వహించారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి పార్టీలు మ్యానిఫెస్టోలో అమలు చేయబోయే పథకాలను ముగ్గుల రూపంలో వేయించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన మహిళలకు నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, నియోజకవర్గ జనసేన ఇన్చార్జ్ చిల్లపల్లి శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా హాజరై బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నందం అబద్దయ్య, చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ముగ్గుల పోటీల్లో పెద్ద ఎత్తున మహిళలు, చిన్నారులు పాల్గొనడం అభినందనీయమని అన్నారు. తెలుగుజాతికి స్వర్ణయుగం టీడీపీ జనసేనతోనే సాధ్యం అని అన్నారు. వైసీపీ పాలనపై విసిగిపోయిన ప్రజలు చంద్రబాబు నాయుడును, పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానిస్తున్నారన్నారు. ప్రజలందరికి కష్ట, నష్టాలు తొలగి స్వేచ్ఛాయుత జీవితం గడపాలంటే వైసీపీ పాలన అంతానికి ఈ సంక్రాంతి ఆరంభం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయ రావు, పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, గుంటూరు పార్లమెంటరీ తెలుగు యువత అధికార ప్రతినిధి బిట్రా దుర్గారావు, 20వ వార్డు అధ్యక్షులు బట్టు మోహన్, జంజనం వెంకట సుబ్బారావు, ఉద్దంటి లక్ష్మయ్య , చెరుకు పూర్ణ, వెలగపాటి విలియం, బట్టు వెంకటేశ్వరావు, దామర్ల బిక్షరావు, ఉప్పు సత్యం, దామర్ల సాంబశివరావు అడిగోప్పల రాము, దామర్ల సురేష్, గొర్రె దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

# అప్పులే అతని తలరాత..! - కన్నీరు పెడుతున్న రైతన్న




గుంటూరు జిల్లా.నేటి దిన పత్రిక సూర్య బ్యూరో : గుంటూరు జిల్లాలో రైతులకు వ్యవసాయం మోయలేని భారమైపోయింది. అందులోనూ సొంత భూమి లేని వారి కష్టాలు చెప్పనలవి కాదు. వాళ్లకు భూమి కౌలు అదనపు భారం. కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సీసీఆర్(క్రాప్ కల్టివేటర్ రైట్) కార్డులు ఇస్తోంది. కానీ రైతుల సంక్షోభాన్ని ఈ కార్డులు ఏమాత్రం పరిష్కరించడం లేదు. జిల్లాలో లక్ష మందికి పైగా కౌలు రైతులు ఉండగా ప్రభుత్వం కార్డులు ఇవ్వాలనుకున్న లక్ష్యమే చాలా తక్కువగా ఉంది. అవి కూడా సక్రమంగా ఇవ్వడం లేదనే విమర్శలు ఉన్నాయి. ...... ఏడాదంతా కష్టపడి వ్యవసాయం చేసినా కౌలు రైతులకు నోటికి.. చేతికి దూరం తగ్గడం లేదు. కౌలుతో సహా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇంత వెచ్చించినా ప్రకృతి విపత్తులతో పంట చేతికి రాని సందర్భాలే ఎక్కువ. దీంతో భారీగా కౌలు రైతులు నష్టపోతున్నారు. వీరికి సీసీఆర్ (క్రాప్ కల్టివేటర్ రైట్) కార్డులు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం కనీసంగా అందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లా వ్యాప్తంగా 70 శాతం మంది కౌలు రైతులు గుర్తింపునకు నోచుకోవడం లేదు. పెట్టుబడి సాయం, పంట ఉత్పత్తులను అమ్ముకోవడం, నష్ట పరిహారం లేదా ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, పంటల రుణం ఇలా ఏది వర్తించాలన్నా సీసీఆర్ కార్డు ఉండాల్సిందే. వీటన్నిటికి ఈ కార్డు ఉంటేనే కౌలు రైతులకు అర్హత ఉంటుంది. కానీ ఉన్నతాధికారులు జిల్లావ్యాప్తంగా కౌలు రైతులందరికీ సీసీఆర్ కార్డులు ఇవ్వడానికి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ సీజన్లోనైనా అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే తమకు సీసీఆర్ కార్డులు అందుతాయని కౌలు రైతులు అంటున్నారు. సకాలంలో అందుతాయా లేదా అనే అనుమానం రైతుల్లో వ్యక్తమవుతోంది. రబీ సీజన్లో కొన్ని పంటలు సాగు చేసేందుకు రైతులు సొంత భూమి ఉన్న రైతులు ప్రభుత్వం అందించే అరకొర రాయితీ విత్తనాలకు తోడు, ఇప్పటికే వారి ఖాతాలో జమ అయిన రైతు భరోసా చేదోడుతో సాగుకు సిద్ధమవుతున్నారు. కానీ కౌలు రైతుల పరిస్థితి రబీ సీజన్లో కూడా అగమ్య గోచరంగా ఉంది. వారికి ఏ ఆసరా లేదు. ప్రభుత్వం ఏటా వారికి అందించే సీసీఆర్‌సీ పత్రాలు ఇప్పటికీ చాలామందికి అందలేదని తెలుస్తోంది. గతంలో కార్డులు ఉన్న రైతులు కొంతమంది మళ్లీ రెన్యువల్ చేయించుకున్నారు. మరికొందరు మరిచిపోయినట్లుగా ఉన్నారు. .భూ యజమాని అనుమతితో కార్డును రెన్యువల్ చేయించుకోవాలి. ఈ ప్రక్రియ మొత్తం మే నెలాఖరు వరకు ముగించి ఖరీఫ్ ప్రారంభమయ్యే జూన్ నెల మొదటి రెండు వారాల్లో రైతులకు కార్డులు ఇవ్వాల్సి ఉండగా జూలై నెల వచ్చినా నేటికీ చాలామంది కార్డులు రెన్యువల్ కాలేదు అని రైతుల్లో అవగాహన లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చినట్లు తెలుస్తోంది. సంబంధిత పత్రాలను కౌలు రైతులు సమర్పిస్తే వీఆర్వో ఆమోదంతో కార్డులు కౌలు రైతులకు అందుతాయి. ఈ ప్రక్రియ అంతా జరిగి కార్డులు కొన్ని గత ఏడాది జూలై మొదటి వారంలో రైతులకు అందజేశారు. . కార్డులు ఉన్న కౌలు రైతులకు రబీ సాగుకు అవసరమైన రాయితీ విత్తనాలు, రైతు భరోసా సాయం కూడా అందే అవకాశం ఉంది. సొంత భూమి ఉన్న రైతులే పంటల సాగుకు అవసరమైన పెట్టుబడుల కోసం నానా అగచాట్లు పడుతోంటే సీసీఆర్ కార్డులు లేని కౌలు రైతుల కష్టాలు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు. సీసీఆర్ కార్డులు అందరికీ అందకపోవడానికి కారణం భూ యజమానులకు వీటిపై అవగాహన లేకపోవడమే. కౌలుదారులకు న్యాయం చేయాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే ముందు భూ యజమానులకు సీసీఆర్ కార్డులపై పూర్తిస్థాయి అవగాహన కల్పించాలి. కౌలు రైతులకు ఈ కార్డు ఇవ్వడానికి అంగీకరిస్తే తమ భూహక్కుకు ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలియజెప్పాలి. ఈ కార్డు మనుగడలో ఉండేది కేవలం 11 నెలలే కాబట్టి తరువాత యజమాని కౌలుదారును మార్చుకున్నా లేక కౌలును రద్దు చేసుకున్నా ఎలాంటి ఇబ్బంది ఉండదని వివరించాలి. కానీ క్షేత్రస్థాయిలో వీటి మీద అవగాహన కల్పించాల్సిన యంత్రాంగం అంతగా శ్రద్ధ చూపడం లేదు. దీనివల్ల గుంటూరు జిల్లా వ్యాప్తంగా కొద్ది శాతం మంది మాత్రమే కౌలు రైతులుగా గుర్తింపు పొందుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే కౌలు రైతులకు మేలు జరుగుతుందని రైతు సంఘ నాయకులు అంటున్నారు. వ్యవసాయం లాభసాటి కాకపోవడంతో భూమి కౌలుకు తీసుకొని వ్యవసాయం చేయడం దుర్భరంగా మారింది. దీని వల్ల కౌలు రైతుల సంఖ్య జిల్లాలో బాగా తగ్గిపోతోంది. కౌలు సేద్యం చేసిన రైతుకు కష్ట నష్టాలు, అప్పుల చిట్టాలే మిగులుతున్నాయి.నీటి సౌకర్యం బాగా ఉంటే ఎకరాకు వేలకు వేలు కౌలు కట్టాలి. తీరా ప్రకృతి విపత్తులతో నష్టం వచ్చినా కౌలు చెల్లించాల్సిందే! మార్కెట్లో ధర లేకపోయినా నష్టపోవాల్సిందే. ఈ బాధలు పడలేక చాలామంది కౌలు వ్యవసాయం చేయడానికి సాహసించడం లేదు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 4 లక్షల మంది రైతులు ఉన్నారని అంచనా. వీరిలో 90 నుంచి లక్ష మంది కౌలు రైతులు ఉంటారని చెబుతున్నారు. వారిలో సీసీఆర్ కార్డులు చాలా కొద్ది మందికే ఉన్నాయి. గత ఏడాది ఉమ్మడి జిల్లాలోనే ఈ సంఖ్య 55 వేలు దాటలేదు. దీనిని బట్టే అర్థం చేసుకోవచ్చు.. కార్డుల జారీ ప్రక్రియ ఎంత లోపభూయిష్టంగా ఉందో. సీసీఆర్ కౌలు రైతుల కష్టాలన్నిటినీ తీర్చే సంజీవని అని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవాలు మరోలా ఉన్నాయి. వాతావరణ పరిస్థితుల వల్ల పంట నష్టపోతే అందించే బీమా... దిగుబడులకు ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర అన్నింటికీ సీసీఆర్‌సీ లింకు తప్పనిసరి. గత ప్రభుత్వంలో ఈ మెలిక లేకపోవడంతో కౌలు రైతులకు కొన్ని ఫలాలు అందేవి. రైతు సంక్షేమమే తమ ధ్యేయమని వల్లె వేసే వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ సంస్కరణలు, ప్రక్షాళనల వల్ల కనీసంగా కూడా తమను మేలు జరగడం లేదని జిల్లా కౌలు రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రతి ఏటా జిల్లా రైతాంగానికి ఇచ్చే వేల కోట్ల రుణ పద్దులో కౌలు రైతుల వాటా 10 శాతం ఉండాలని ప్రభుత్వం చెబుతోంది. కానీ వాస్తవానికి ఈ వాటా చాలా తక్కువగా ఉంటోంది. వీరికి అందించే రుణం 2 శాతం కూడా దాటడం లేదు. దీంతో ప్రతి సీజన్ ప్రారంభంలో కౌలు రైతులు పెట్టుబడి సాయం కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. వ్యాపారులు అధిక వడ్డీలు, కమీషన్ల పేరుతో దోచుకోవడంతో కౌలు రైతులు అప్పుల పాలవుతున్నారు. భూ యజమానులే బ్యాంకు రుణాలు అందక సేద్యం చేయలేకపోతున్న తరుణంలో ప్రైవేటు వ్యక్తుల మీదే ఆధారపడి సాగు చేస్తున్న కౌలు రైతుల బాధలు ఎలా ఉంటాయో ఊహించవచ్చు. జిల్లాలో కౌలు రైతులు చాలా మంది ఉన్నారు. దుక్కి దున్నడం దగ్గర నుంచి కోత కోసి పంట ఉత్పత్తులను అమ్మే వరకు ఎక్కడ ప్రతికూలత ఏర్పడినా నష్టపోవాల్సిందే. గత వారం నుండి వాతావరణంలో ఎన్నో మార్పులు రావడం వల్ల వరి, వాణిజ్య పంటలను తెగులు ఆశించి పంట చేతికి వచ్చే తరుణంలో రైతులు నట్టేట మునిగి పరిస్థితులు దాపురించాయి. సీసీఆర్ కార్డు లేకపోతే రైతు భరోసా, పంట బీమా, మద్దతు ధర ఇలాంటివి కూడా అందవు. కాబట్టి జిల్లాలోని కౌలు రైతులందరికీ సీసీఆర్‌సీ కార్డులు అందించాలి. కౌలు రైతులకు సీసీఆర్ కార్డులను అందించేందుకు కృషి చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. సీసీఆర్ కార్డుల వల్ల భూ యజమానికి నష్టం ఉండదు.

# రా.. కదిలి రా.. చంద్రబాబును విజయవంతం చెయ్యండి

## సభా స్థలిని పరిశీలించిన టీడీపీ అగ్ర నాయకులు






**గుడివాడ, మేజర్ న్యూస్:** మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొననున్న రా.. కదలి రా.. సభను విజయవంతం చేయాలని ఆపార్టీకి చెందిన మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావు, మాజీ ఎంపీ మాగంటి బాబు పిలుపు నిచ్చారు. ఈ నెల 18న గుడివాడలోని మల్లాయిపాలెంలోని అలంకృత ఫంక్షన్ హాలు సమీపంలో నిర్వహించనున్న చంద్రబాబు రా.. కదలి రా.. సభ ఏర్పాట్లను పరిశీలించేందుకు పార్టీ అగ్ర నాయకులు మంగళవారం గుడివాడ వచ్చారు. ఈ సందర్భంగా పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ రాష్ట్రానికి గుడివాడ ప్రతిష్ఠాత్మకం, టీడీపీ మొదట ఓడించే సీటు ఇదేనన్నారు. రాజకీయాలను అగౌరపరుస్తున్న గుట్కా నానిని ఓడించాలని పిలుపునిచ్చారు. మాగంటి బాబు మాట్లాడుతూ మాలక్ష్యం గుడివాడ సీటును కైవసం చేసుకోవడమేనన్నారు. 18న గుడివాడలో లక్షమందితో సభ నిర్వహించి తీరుతామని పిల్లి మాణిక్యాలరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ గుడివాడ ఇంఛార్జి వెనిగండ్ల రాము, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, గోర్జి సత్యన్నారాయణ, చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, త్రినాథ రాజు, సురేష్, సన్యాసిరావు, నాయకులు పాల్గొన్నారు.

# డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ విజయవంతం మన బాధ్యత



**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్:** విజయవాడ మేజర్ న్యూస్ : ఈ నెల 19వ తేదీన నగరంలో జరగనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం కార్యక్రమానికి రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి తరలి రానున్న 1.35 లక్షలమంది ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించేలా జిల్లా యంత్రాంగం నిబద్ధతతో విధులు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్ కుమార్, సబ్ కలెక్టర్ ఆదితి సింగ్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమ నిర్వహణలో శాఖల మధ్య సమన్వయం చాలా ముఖ్యమన్నారు. ప్రధానంగా 19వ తేదీ సాయంత్రం నాలుగున్నర గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. అనంతరం మైదానంలో విగ్రహావిష్కరణ చేస్తారని చెప్పారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగే సభకు హాజరయ్యే వారు ముందుగానే గ్యాలరీలలో కూర్చుని ముఖ్యమంత్రి ప్రసంగం ఆసాంతం వినేందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు.సౌండ్ సిస్టం తోబాటు సభా ప్రాంగణం బందర్ రోడ్ లలో 35 ఎల్ఈడి తెరల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్యాలరీల నిర్వహణ క్రమబద్ధంగానిర్వహించాలన్నారు. ఎటువంటి ఇబ్బంది లేకుండా పోలీస్ శాఖ తగు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. గతంలో ఇటువంటి కార్యక్రమాలు ఎన్నో జరిగినప్పటికీ ఈ సామాజిక న్యాయ మహాశిల్పం కార్యక్రమం జిల్లా చరిత్రలో ఒక అద్భుత ఘట్టంగా నిలిచిపోయేలా కార్యక్రమ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జిల్లాలోని ఎంపీడీవోలు, తహసిల్దార్లు, సచివాలయ కార్యదర్శులు, ఆరోగ్యశాఖ, రెవెన్యూ శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించేందుకు తగిన సిబ్బందిని ఆయా శాఖల నుంచి సమీకరించుకోవాలని పేర్కొన్నారు. ప్రధానంగా 19వ తేదీ మధ్యాహ్నానికే సభా ప్రాంగణంలోకి ప్రజలు వస్తారన్నారు. అలా వచ్చిన వారిని క్రమ పద్ధతిలో కూర్చోబెట్టడం, సదానంతరం వారిని సురక్షితంగా వారి వారి ప్రయాణ వాహనాల వద్దకు చేరేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని వివరించారు. ముఖ్యంగా రాయలసీమ, దక్షిణ ఆంధ్ర ప్రదేశ్ ప్రాంతాల నుంచి బస్సులలో వస్తున్న వారికి ఆహారం పొట్లాలు ఆయా ప్రాంతాల నుంచి బస్సులో వచ్చే పర్యవేక్షకులే ఏర్పాటు చేసుకుంటారని చెప్పారు. ప్రజలు నగరంలోని ప్రవేశించిన తర్వాత వారికి అవసరమైన మంచినీరు, మరుగుదొడ్ల వంటి ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. ఒక్కొక్కరికి సగటున ఆరు వాటర్ ప్యాకెట్లు అందించేలా అధికారులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి ప్రసంగం ప్రారంభం కాగానే నగరంలోని అన్ని ప్రాంతాలలో ప్రజలు ఈ ప్రసంగాన్ని వీక్షించేలా అధికారులు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. 1750 కి పైగా ఆర్టిసి బస్సులు, ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన వెయ్యికి పైగా బస్సుల లలో ప్రజలు కార్యక్రమానికి హాజరవుతారని ఆయా వాహనాలు నిలిపేందుకు అవసరమైన పార్కింగ్ ప్రాంతాలను కూడా గుర్తించినట్లు చెప్పారు. ఏ ప్రాంతం నుంచి వచ్చే బస్సులు ఎక్కడ పార్కింగ్ చేయాలో తెలిపేలా పోలీస్ శాఖ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సభా ప్రాంగణం పరిసర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. బహిరంగ సభ అనంతరం విగ్రహావిష్కరణకు ముఖ్యమంత్రి వచ్చే సమయం ఎంతో కీలకమన్నారు. ఆ సమయంలోనే ప్రజలు ఒక్కసారిగా స్టేడియం నుంచి బయటకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అటువంటి కీలక సమయంలో ఆయా గ్యాలరీలకు కేటాయించిన అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్వో కె. నాగేశ్వరరావు, ఆర్డీవో సాయిబాబు, డ్వామా పీడీ జె. సునీత, డి ఎం హెచ్ ఓ డా . ఎం.సుహాసిని, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి వి. విజయభారతి, డిఐపిఆర్ఓ యు .సురేంద్రనాథ్, డిఆర్డిఏ పి డి కె. శ్రీనివాసరావు, డిపిఓ జయచంద్ర గాంధీ ఉద్యన అధికారి బాలాజీ కుమార్ వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## జోరుగా కోడిపందాలు, జూదాలు



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** నిబంధనలకు విరుద్ధంగా జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న అధికారులు మాటలు ఆచరణలో చూపకపోగా విచ్చలవిడిగా అనధికార అనుమతులు ఇవ్వటంతో సంక్రాంతి పర్వదినం మూడు రోజులు కోడిపందాలు, జూదాలు విచ్చలవిడిగా సాగాయి. చల్లపల్లి మండలం వెలివోలులో కరకట్ట దిగువన కోడిపందాలు పెద్దఎత్తున నిర్వహించగా, కోడిపందాలతోపాటు ఇతర జూదాలు సైతం జరిగాయి. దీంతోపాటుగా గ్రామాల్లో పేకాటలు నిర్వహించారు. పందెం రాయుళ్లు పెద్దఎత్తున శిబిరాల వద్దకు క్యూలు కట్టారు. భోగి పండుగ రోజున మొదలైన పందాలు, సంక్రాంతి, కనుమ రోజున కొనసాగాయి. మూడు రోజులపాటు యదేచ్ఛగా కొనసాగిన పందాలు బుధవారం కూడా కొనసాగుతాయో లేదో వేచిచూడాలి.

## జ్యోతివైభవంగా కర్పూర జ్యో



**చల్లపల్లి- మేజర్ న్యూస్ :** సంక్రాంతి పర్వదినం సందర్భంగా అయ్యప్ప భక్తులు విశేషంగా భావించే మకర జ్యోతి దర్శనం సందర్భంగా సోమవారం స్థానిక అయ్యప్ప దేవాలయాల వద్ద కర్పూర జ్యోతి(మరక జ్యోతి) కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక నిమ్మలతోటలోని హరిహర పుత్ర శ్రీఅయ్యప్పస్వామి క్షేత్రంలో మకర జ్యోతి సమయాన జ్యోతిని వెలిగించారు. తొలుత ఆలయ వ్యవస్థాపకులు అన్నవరపు పాండురంగారావు గురుస్వామి ఇంటివద్ద నుంచీ అయ్యప్పస్వామి నగలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు భాను నంబూద్రి స్వామివారిని బంగారు నగలతో రాజకుమారునిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక శ్రీసంపటాలమ్మ తల్లి ఆలయ ఆవరణలోని శ్రీధర్మశాస్త్రా అయ్యప్పస్వామి వారి ఆలయంలో మకర జ్యోతి సమయాన కర్పూర జ్యోతిని వెలిగించగా, అయ్యప్పలు జ్యోతిని దర్శించుకుని పూజలు చేశారు.

## పండగ పూట టీడీపీ - వైసీపీల సయ్యాట



**నందిగామ, జనవరి 16, మేజర్ న్యూస్:** అనవసరమైన వివాదాస్పద రాజకీయాలతో సంతోషకరమైన పండగ వాతావరణాన్ని తెలుగుదేశం పార్టీ వైసిపి పార్టీలు చెడగొట్టటాన్ని బిజెపి స్పోక్స్ పర్సన్ కేదార్నాథ్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సంవత్సరమంతా కష్టపడి పంటలు పండించుకొని ఆ పంటలతో పిండి వంటలు చేసుకొని ఆనందంగా ఉన్న సమయంలో మీ వ్యక్తిగత కుర్చీ సయ్యాటలతో అధికారలాలసతో ప్రజల మధ్య ఉన్నటువంటి స్నేహపూర్వక వాతావరణాన్ని చెడగొట్టడం , ప్రజలను కవ్వింపు చర్యలకు పాల్పడే చర్యలకు పాల్పడటం బిజెపి ఖండిస్తుంది అన్నారు. హిందువుల పండగ రోజుల్లోనే ముఖ్యమైన పశువుల పండుగ అయిన కనుమ రోజు ఇటువంటి చర్యల ద్వారా మీరు ఏమి సందేశం ఇద్దాం అనుకుంటున్నారు. అటు పండుగ చేసుకోవాల్సినటువంటి పోలీస్ బంధువులు వాళ్ళ ఇళ్ళను వదిలిపెట్టి మీకోసం అని మీ ఇళ్ల చుట్టూ తిరుగుతూ ఎక్కడ గొడవలు జరుగుతాయి అని టెన్షన్లతో వారి కుటుంబ సభ్యులతో పండగలు చేసుకోకుండా కాపలా కాసిన పరిస్థితి ఈ చర్యలు అన్నిటిని బిజెపి అధికార ప్రతినిధిగా ఖండిస్తున్నట్లు తెలిపారు.

# దివ్యాంగులకు సహాయం చేస్తే భగవంతునికి చేసినట్లే..



**గన్నవరం, జనవరి 16, మేజర్ న్యూస్ :** దివ్యాంగులకు సహాయం చేస్తే స్వయంగా భగవంతుని చేసినట్లు అని ప్రవాస భారతీయుడు రక్షణ కుమార్ అన్నారు. గన్నవరం మండలం దావాజిగూడెంలో ఉన్న హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పందన మానసిక వికాస కేంద్రానికి అమెరికా దేశంలో ఉంటున్న రక్షణ కుమార్ శ్రీలత దంపతులు మంగళవారం సందర్శించి స్పందన మానసిక వికాస కేంద్రం నూతన నిర్మాణానికి 50,000 రూపాయల విరాళాన్ని సంస్థ సెక్రటరీ సంకాబత్తుల రజిత వెంకట్ కు అందించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు స్పందన లో దివ్యాంగులకు అందుతున్న సర్వీస్ గురించి సంస్థ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ ను రక్షణ్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా గన్నవరంనకు చెందిన ప్రభుత్వ రిటైర్డ్ ఉపాధ్యాయులు పెదముత్తేవి మోషే మాష్టారు కుమారుడు అమెరికా లో ఐ.టి సీనియర్ మేనేజర్ ప్రవాస భారతీయుడు రక్షణ కుమార్ మాట్లాడుతూ ఒకరికి సహాయంలో చెయ్యడంలో ఉన్న సంతృప్తి కోట్లాది రూపాయల సంపాదించడంలో రాదని అదే జీవితానికి సార్థకతన్నారు. స్పందన మానసిక వికాస కేంద్రంలో దివ్యాంగులకు చేస్తున్న సేవ అత్యున్నతమైనదని ఇలాంటి సంస్థలకు సామాజిక బాధ్యతతో తోడ్పాటు అందించనట్లుయితే మెరుగైన సమాజం నిర్మించబడుతుందని రక్షణ్ కుమార్ అన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంతోమంది కి సహాయం చేస్తున్నారని ఇలాంటి గొప్ప సేవలు చేస్తున్న సంస్థ కు సహాయం చెయ్యడం చాలా ఆనందంగా ఉందని అయన అన్నారు. కరోనా క్లిష్టమైన పరిస్థితులలో ఈ సమాజం కష్టకాలంలో ఉందని గమనించి వేలాదిమంది కి సహాయం చెయ్యడం ఎంతో ప్రశంసనీయమన్నారు. భవిష్యత్తులో మరింత చేయూత అందిస్తామని, దివ్యాంగుల అభివృద్ధి సంక్షేమంలో భాగంగా విద్యా, వైద్య, రవాణా, భోజన సౌకర్యాలు నిరంతరం అందిస్తున్న సంస్థ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ ను సెక్రటరీ సంకాబత్తుల రజిత వెంకట్ ను ఆయన అభినందించారు. స్పందన బాలలు కూడా సాధరమైన పిల్లలు వలె ఆర్టికల్స్ తయారు చేస్తున్నారని మరింత ప్రోత్సాహం అందించినట్లుయితే మరిన్ని అద్భుతాలు సృష్టిస్తారని రక్షణ్ కుమార్ అన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ కృష్ణా జిల్లా దివ్యాంగుల హక్కుల పరిరక్షణ అడ్వైజరీ కమిటీ బోర్డు మెంబర్ సంకాబత్తుల వెంకట్ మాట్లాడారు. అనంతరం స్పందన మానసిక వికాస కేంద్రానికి సహాయం చేసిన రక్షణ్ కుమార్ శ్రీలత దంపతులకు కృతజ్ఞతలు తెలుపుతూ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ తరుపున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది బి.వి.రత్నాచారి తదితరులు పాల్గొన్నారు.